వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 211

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: బుధవారం 02 సెప్టెంబర్ 2026







**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** అంతర్జాతీయ సదస్సు వేదికగా పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని బయటపెట్టుకుంది. షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సు సందర్భంగా సభ్య దేశాల అధినేతలు దిగిన ఫొటోను పాక్ క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వివాదం చెలరేగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కనిపించకుండా కట్ చేసిన ఫొటోను పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం పోస్టు చేయడం కలకలం రేపింది. అలాగే ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను హైలైట్ చేస్తూ ఫొటో మధ్యలో కనిపించేలా ఎడిట్ చేయడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో మంగళవారం జరిగిన ఎస్‌సీవో సదస్సులో 10 సభ్య దేశాల నేతలు కలిసి ఫొటో దిగారు. అయితే పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం విడుదల చేసిన చిత్రంలో మోదీతో పాటు ఇరాన్ అధ్యక్షుడు, మరికొందరు నేతలు కనిపించలేదు. ఫొటోను అలా కట్ చేయడం ద్వారా షెహబాజ్ షరీఫ్‌ను గ్రూప్‌లో మధ్యలో ఉన్నట్టుగా చూపించే ప్రయత్నం చేసినట్లు స్పష్టమైంది. వాస్తవానికి పూర్తి ఫొటోలో షెహబాజ్ షరీఫ్ కుడివైపు నుంచి నాలుగో స్థానంలో ఉన్నారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసిన అసలు ఫొటో స్పష్టం చేసింది. అందులో ఎస్‌సీవో నేతలందరితో పాటు షెహబాజ్ షరీఫ్ కూడా స్పష్టంగా కనిపించారు. దీంతో పాకిస్థాన్ చేసిన ఎడిటింగ్ సోషల్ మీడియాలో బయటపడింది.




**సమయం ప్రతినిధి:** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (TMC) అధినేత్రి మమతా బెనర్జీ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మమత సోదరుడి కుమార్తె, 28 ఏళ్ల బృష్టి ముఖర్జీ పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లా రాంపూర్ హాట్ సమీపంలోని కుసుంబా గ్రామంలో ఉన్న నివాసంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. భవనం రెండో అంతస్తులోని ఆమె గదిలో ఉరి వేసుకుని ప్రాణాలొదిలారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతికి గల పూర్తి కారణాలు.. పోస్టుమార్టం నివేదిక, సమగ్ర విచారణ అనంతరం వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. బృష్టి ముఖర్జీ విడాకుల కేసు విచారణ దశలో ఉందని, కొన్ని సంవత్సరాలుగా ఆమె తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని, దీనికి సంబంధించి చికిత్స కూడా పొందుతున్నారని కుటుంబ సభ్యులు చెప్పారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఉద్యోగాలు రద్దవ్వడంతో, ఆమె కూడా తన ఉద్యోగాన్ని కోల్పోయారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఉద్యోగం పోయినప్పటి నుంచి ఆమె మరింత ఆందోళనకు గురైనట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు మొదలుపెట్టారు.

## వాద్‌నగర్ నుంచి వారణాసి వరకు..



**సమయం ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా భారతీయ జనతా పార్టీ (BJP) భారీ కార్యక్రమానికి సిద్ధమవుతోంది. వాద్‌నగర్ నుంచి వారణాసి వరకు 30 రోజుల యాత్ర చేపట్టనుంది. ఈ యాత్రలో పది బృందాలు పాల్గొంటాయి. ఈ యాత్ర మోదీ జన్మదినం రోజైన సెప్టెంబర్ 17న ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగనుంది. ప్రధాని మోదీ జన్మస్థలమైన గుజరాత్‌లోని వాద్‌నగర్, ఆయన లోక్‌సభ నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలను అనుసంధానిస్తూ ఈ యాత్ర నిర్వహించనున్నారు. వాద్‌నగర్, వారణాసి నుంచి ఒకేసారి మొత్తం 10 బృందాలు బయలుదేరనున్నాయి. వారణాసి నుంచి బయలుదేరే బృందాలు వివిధ రాష్ట్రాల మీదుగా ప్రయాణించి నెల రోజుల్లో వాద్‌నగర్ చేరుకుంటాయి. అలాగే వాద్‌నగర్ నుంచి బయలుదేరే బృందాలు వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాణించి వారణాసికి చేరుకుంటాయి. ప్రతి బృందం రోజుకు దాదాపు 100 కిలోమీటర్లు ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రతి బృందంలో 10 మందికి పైగా బైకర్లు ఉండనున్నారు. అలాగే ఇతర కార్యకర్తలు బస్సుల్లో ప్రయాణించనున్నారు. ఇలా బైక్‌లు, బస్సుల్లో పట్టణాలు, గ్రామాలు, జిల్లా కేంద్రాల మీదుగా ప్రయాణిస్తూ స్థానిక ప్రజలతో బీజేపీ కార్యకర్తలు మమేకం కానున్నారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 1, సమయం ప్రతినిధి:** హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (Telangana CM Revanth Reddy) వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్(X) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. వాదీూ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. MIT, అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# తుమ్మిడిహట్టిపై తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారుల సుదీర్ఘ భేటీ..



**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** తుమ్మిడిహట్టి బ్యారేజీపై ఢిల్లీలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారుల మధ్య సమావేశం ముగిసింది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా బ్యారేజీ ఎత్తు, సాంకేతిక అంశాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమీక్షించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తును గతంలో మహారాష్ట్ర అంగీకరించిన 148 మీటర్లకు బదులుగా 152 మీటర్లకు పెంచేలా ఆ రాష్ట్రాన్ని ఒప్పించేందుకు తెలంగాణ అధికారులు తమ ప్రతిపాదనలను సమావేశంలో వివరించినట్లు తెలిసింది. బ్యారేజీ ఎత్తు పెంపుతో తెలంగాణకు కలిగే ప్రయోజనాలను అధికారులు మహారాష్ట్ర దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే, 152 మీటర్ల ఎత్తుపై మహారాష్ట్ర నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదని తెలుస్తోంది. 152 మీటర్ల ప్రతిపాదనకు అంగీకారం కుదరని పరిస్థితుల్లో కనీసం 150 మీటర్ల ఎత్తుకైనా అంగీకరించాలని తెలంగాణ అధికారులు కోరినట్లు తెలిసింది. తెలంగాణ ప్రతిపాదనలను ఆ రాష్ట్ర అధికారులు స్వీకరించి, వాటిని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. బ్యారేజీ ఎత్తుపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించేందుకు తదుపరి దశలో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. తదుపరి భేటీలో బ్యారేజీ ఎత్తుపై మరింత స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.




**హైదరాబాద్, సెప్టెంబర్ 1, సమయం ప్రతినిధి:** తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే తెలంగాణ కాంగ్రెస్ కీలక నేతలు వరుసగా ఈరోజు (మంగళవారం) ఢిల్లీ బాట పట్టారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీకి మంత్రి కొండా సురేఖ చేరుకున్నారు. సురేఖతో పాటు ఢిల్లీకి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా వెళ్లారు.

### మంత్రి పదవి నుంచి తప్పిస్తారా..?

అయితే, మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత ఇటీవల ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ హై కమాండ్ ఈ వ్యాఖ్యలపై సీరియస్ అయింది. ఈ విషయంపై అధిష్ఠానం గరంగరంగా ఉంది. ఈ క్రమంలోనే సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపురావడం ఉత్కంఠగా మారింది. ఆమెను మంత్రి పదవి నుంచి తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జునఖర్గే అపాయింట్‌మెంట్‌ను ఆమె కోరారు.

## మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

### బాలానగర్‌లో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహణ



**సమయం: సెప్టెంబర్ 1, మహబూబ్‌నగర్:** మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్ మండల కేంద్రంలో రెండు రోజుల పాటు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్ వైద్య నిపుణుల బృందం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఫ్యూలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణుల బృందం ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు ఎంపీ డీకే అరుణ వెల్లడించారు. మహిళల్లో క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత క్యాంప్‌ను బాలానగర్ మండలంతో పాటు పరిసర ప్రాంతాల మహిళలు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డీకే అరుణ కోరారు.




**హైదరాబాద్, సెప్టెంబర్ 1, సమయం ప్రతినిధి:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై హైకోర్టు సింగిల్ ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయగా.. ఈరోజు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై సింగిల్ బెంచ్ స్టే విధించడం వల్ల పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పథకం వల్ల ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు మేలు జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పథకాల చట్టబద్ధతను సవాల్ చేస్తూ సింగిల్ బెంచ్‌లో వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని తెలిపారు. పథకం అమలుపై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన సీజే ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# సంపాదకీయం

## హిమాలయ 'సునామీ'కి బాధ్యులెవరు?

నేపాల్‌ను విషాదసీమగా మార్చివేసిన మహా విపత్తు అది. హిమాలయ మంచుకొండల మీది హిమనీనదాలు కరిగిపోయాయి. నిటారుకొండలు తమ గర్వాన్ని వీడి కూలిపోయాయి. నదులు వరద జలాలతో పోటెత్తాయి. అనూహ్యమైన జలప్రళయమది. హిమాలయ ప్రాంతాల్లో సంభవించిన ఈ విపత్తు అసాధారణమైనది. విపత్తు దృశ్యాలు భయానకమైనవి. దశాబ్దానికి పైగా అంతర్జాతీయ వాతావరణ విధానంపై కృషి చేస్తున్న నేపాలీ పౌరుడిగా నేను ఈ విపత్తుకు తీవ్రంగా కలత చెందాను. ఆవేదనకు మించిన ఆగ్రహం నన్ను కుదిపివేసింది. ఇటువంటి ప్రళయం విరుచుకుపడవచ్చని శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రపంచ వాతావరణ కార్యాచరణలో జాప్యమే ఈ జల ప్రళయం, సందేహం లేదు. హరితగృహ వాయు ఉద్గారాలను తగ్గించి, భూ తాపాన్ని పరిమితం చేయడమే లక్ష్యంగా ఉన్న ప్రపంచ వాతావరణ కార్యాచరణ విషయంలో ప్రపంచ దేశాల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే ఇటువంటి ప్రళయం జరిగేదేనా? ఆగస్టు 26న మంచు, నీరు, బండరాళ్లు, బురదతో కూడిన రాకాసివరద అశేష ప్రజలను కకావికలు చేసింది. లక్షలాది గృహాలను ధ్వంసం చేసింది, మార్కెట్లు, వంతెనలు, రోడ్లు రూపు లేకుండా పోయాయి. ఇటు నేపాల్‌లోను, అటు టిబెట్‌లోను విద్యుదుత్పాదన కేంద్రాలు కొట్టుకుపోయాయి. వందలాదిమంది మరణించగా, జాడలేకుండా పోయినవారు వేల సంఖ్యలో ఉన్నారు. అనూహ్య వేగంతో ఈ విధ్వంసం చోటుచేసుకున్నది. పర్వతాగ్రాలపై మొదలైన విపత్తు క్షణాల్లో దిగువ ప్రాంతాలకు వ్యాపించింది. ఈ విపత్తు ఒక వాస్తవాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది: నేపాల్‌కు మరింత బలమైన ముందస్తు విపత్తు హెచ్చరిక వ్యవస్థలు, హిమనీనదాల, అస్థిర కొండవాలుల నిరంతర మెరుగైన పర్యవేక్షణ, నేపాల్, టిబెట్‌లో ఉమ్మడి జలవనరుల పరివాహక ప్రాంతాలు ఉన్నందున ఈ రెండు హిమాలయ ప్రాంతాల మధ్య సరిహద్దు సమాచార మార్పిడి, మరీ ముఖ్యంగా ప్రాకృతిక విపత్తుల సన్నద్ధతలో భారీ ఎత్తున నిధుల వినియోగం అత్యవసరం. నేపాల్‌లో మెరుపు వరదలు ఒక మౌలిక వాస్తవాన్ని బహిర్గతం చేశాయి: సమస్య ముందస్తు హెచ్చరికల వ్యవస్థ లేకపోవడం కాదు; వాతావరణ సంక్షోభం సృష్టిస్తున్న ప్రమాదాలు ఊహింపదగిన విపత్తులకు భిన్నంగా ఉంటున్నాయి; ఫలితంగా హెచ్చరిక వ్యవస్థలు ఆ అనూహ్య అపాయాల సంభవాన్ని గ్రహించలేక పోతున్నాయి. హిమాలయ పర్వతాల పరివేష్టిత భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాలను ముంచివేసిన వరదే అందుకొక ఉదాహరణ. బురద, కొండరాళ్లతో ఆకస్మికంగా విరుచుకుపడిన ఆ వరద నది ఎగువ ప్రాంతంలోని హైడ్రాలాజికల్ కేంద్రాలను, నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టి హెచ్చరికలను జారీ చేయక ముందే ధ్వంసం చేసింది. క్రమంగా పెరిగే నీటి మట్టాల పెరుగుదలను కనిపెట్టేందుకు ఆ హెచ్చరిక వ్యవస్థను రూపొందించారు. అయితే ఆగస్టు 26న సంభవించిన రాకాసి వరద ఆ హెచ్చరిక వ్యవస్థను ముందుగానే సమూలంగా ధ్వంసం చేసింది. ఇదెలా జరిగింది? శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం, ఒక భారీ హిమనీనదం కూలిపోవడం కారణంగా ఇది సంభవించింది. పర్వతాల పై భాగంలో జరిగిన ఈ సంఘటన దిగువ ప్రాంతాలలో హింసాత్మక వరదకు దారితీసింది. ఈ క్రమం తీరుతెన్నులను కచ్చితంగా నిర్ధారించేందుకు ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. అంతిమంగా శాస్త్రవేత్తల వివరణ ఏమైనప్పటికీ వేడెక్కిన పర్వత ప్రాంతాలలో ప్రమాదాలు ఎంత త్వరితంగా మహావిపత్తులుగా పరిణమిస్తాయనేదానికి ఈ సంఘటనే తిరుగులేని నిదర్శనం. స్పష్టంగా చెప్పాలంటే విపత్తును పసిగట్టడానికి ఉద్దేశించిన సాధనాలే దానివల్ల పనిచేయకుండా పోయాయి. ఈ వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. గతంలో సంభవించిన వరదలను బట్టి రూపొందించిన ముందస్తు హెచ్చరిక వ్యవస్థ భవిష్యత్తులో తీవ్రమైన విపత్తుల ముందు సరిపోనిదిగా మిగలవచ్చు. అంతమాత్రాన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు నిష్ప్రయోజనకరమని భావించనవసరం లేదు. అయితే వాటి పరిమితులను మనం గుర్తించాలి, అంగీకరించాలి. వాతావరణ అనుసరణ (వాతావరణ మార్పు, దాని ప్రభావాలకు అనుగుణంగా నష్టాన్ని తగ్గించడానికి సర్దుబాటు చేసుకునే ప్రక్రియ)కూ పరిమితులున్నాయి. మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచుకోవడం, విపత్తుల నెదుర్కొనే సంసిద్ధతను మెరుగుపరచుకోవడం, జీవనాధారాలకు రక్షణ కల్పించడం మొదలైన చర్యలతో అటువంటి సర్దుబాటుకు నేపాల్ చాలా సంవత్సరాలుగా చురుగ్గా ప్రయత్నిస్తున్నది. అయితే వాతావరణ సంక్షోభానికి చారిత్రకంగా బాధ్యత ఉన్న పారిశ్రామిక సంపన్న దేశాల నుంచి నేపాల్‌కు తగు ఆర్థిక సహాయం లభించనే లేదు. తీవ్రమవుతున్న వాతావరణ ప్రమాదాలను, వినాశనకర వరదలను ఎదుర్కోవడానికి నేపాల్‌కు అంతర్జాతీయ సహకారం అత్యవసరం. ఎందుకంటే హిమాలయ ప్రాంతాల్లో సంభవించే ప్రాకృతిక విపత్తులు జాతీయ సరిహద్దులకు ఆవల ఉద్భవిస్తాయి. కనుక సంబంధిత దేశాల మధ్య సహకారం, సకాలంలో సమాచార మార్పిడి ఉండి తీరాలి. నేపాల్ ప్రాంతపు హిమాలయాలు వేగంగా మారుతున్నాయి. హిమనీనదాలు క్షీణిస్తున్నాయి. భూతాపం హిమాలయ ప్రాంతాల సుస్థిర పరిస్థితులను వేగంగా మార్చివేస్తోంది. ఈ సంక్షోభ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకుండా నివారించడమే మొదటిపని కావాలి. దశాబ్దాలుగా శిలాజ ఇంధనాల ఆధారిత అభివృద్ధి నుంచి అత్యధికంగా ప్రయోజనం పొందిన పారిశ్రామిక సంపన్న దేశాలకు కాలుష్యకారక ఉద్గారాలను వేగంగా తగ్గించాల్సిన ప్రత్యేక బాధ్యత ఉంది. ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, సాంకేతికతలు ఆ దేశాలకు సమృద్ధిగా ఉన్నాయి. శిలాజ ఇంధనాల నుంచి పునరుత్పాదక ఇంధనాల వినియోగానికి వారు శీఘ్రగతిన పరివర్తన చెంది తీరాలి. అది ఆవశ్యక న్యాయబద్ధమైన మార్పు. అయితే సంపన్న దేశాలు ఈ మార్పు దిశగా ప్రస్థానించడం లేదన్నది ఒక కఠోర సత్యం. ఈ పరిస్థితుల నుంచి నేపాల్ విధిగా ఒక పాఠాన్ని నేర్చుకోవాలి. వాతావరణ సంక్షోభానికి కారణమైన ఆర్థికాభివృద్ధి నమూనాను అనుకరించకూడదు. ఒక భిన్నమైన వ్యవస్థను నిర్మించుకునే అవకాశం తనకు ఉందనే వాస్తవాన్ని నేపాల్ గుర్తించాలి. అభివృద్ధి పేరిట సహజ వనరులను విచక్షణారహితంగా ఉపయోగించుకోవడాన్ని నిలిపివేయాలి. ప్రజల జీవనోపాధులకు, పర్యావరణ సమ తౌల్యతకు ప్రాధాన్యమిచ్చే ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాలి. కాలుష్యకారక వాయువుల ఉద్గారాలలో నేపాల్ వాటా చారిత్రకంగా ఎప్పుడూ 0.1శాతం కంటే తక్కువగా ఉంటోంది. నేపాల్ తలసరి ఉద్గారాలు ప్రపంచంలోనే చాలా తక్కువ. అయినప్పటికీ తాను సృష్టించని, వాతావరణ సంక్షోభానికి ఆ దేశం అధిక మూల్యం చెల్లిస్తోంది. ఇది న్యాయవిరుద్ధం కాదూ? వాతావరణ మార్పుల ఫలితంగా అనివార్యమవుతున్న ఆర్థిక, ఆర్థికేతర నష్టాల నుంచి కోలుకునేందుకు నష్టపరిహార సహాయం అందించాలని నేపాల్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు పదే పదే డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవలి మహా విపత్తులో సంభవించిన అపార నష్టం నుంచి కోలుకునేందుకు విధిగా పెద్ద ఎత్తున రుణాలు తీసుకోవల్సిన పరిస్థితిని నేపాల్‌కు కల్పించకూడదు. ఇది సంపన్న దేశాల నైతిక బాధ్యత. ఇప్పటికే అందిస్తున్న అధికారిక అభివృద్ధి సహాయానికి అదనంగా నష్ట పరిహార ఆర్థిక సహాయాన్ని అందించాలి. ఈ అదనపు సహాయాన్ని సులభ షరతులపై ఉదారపూర్వకంగా అందించాలి. సంపన్న దేశాలు ప్రస్తుతం తాము ఉపయోగించుకుంటున్న శిలాజ ఇంధనాల పరిమాణాన్ని యథావిధిగా కొనసాగించిన పక్షంలో, నేపాల్ మొదలైన అభివృద్ధి చెందుతున్న దేశాలకు అవి ఎంత అధిక మొత్తంలో నష్టపరిహార సహాయం అందించినా ప్రయోజనం ఉండదు. భోటేకోశి నదీ తీరస్థ ప్రాంతాల ప్రజలు హిమాలయాలు వేడెక్కడాన్ని కోరుకోలేదు. మంచు పర్వతాలు వేడెక్కడానికి కారణమైన శిలాజ ఇంధన ఆర్థిక వ్యవస్థను కూడా వారు ఎంచుకోలేదు. తగినంత ఆర్థిక, సాంకేతికత మద్దతు లభిస్తే పరిస్థితులకు అనుగుణంగా మారి తమ భవిష్యత్తును పదిలం చేసుకోగలరు. హిమనీనదాలు కరగడాన్ని నివారించలేకపోయినప్పటికీ అంతర్జాతీయ ఆర్థిక సహకారం, అధునాతన సాంకేతికతల తోడ్పాటుతో వాతావరణ విపత్తులను ముందుగానే పసిగట్టి, వాటి నుంచి సురక్షితంగా లేదా సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడగలరు.

# కాంగ్రెస్ వైఫల్యాల నిరసన పోరాటంలో ప్రజలు విరివిగా పాల్గొనాలి

## మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిలుపు

(సమయం ప్రతినిధి మహబూబ్ నగర్) : వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై వారం రోజులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతు బీమా, వృద్ధులు వికలాంగులు ఒంటరి మహిళలు వితంతువులకు పింఛన్ల పెంపు, 6 గ్యారంటీల అమలు చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. గ్రామస్థాయి కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ పోరాటంలో పెద్ద సంఖ్యలో పాల్గొనే విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు.. యువత.. మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికీ రానున్న రోజుల్లో తగిన గుర్తింపు ఉంటుంది.వారం రోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమల్లో అందరూ సమిష్టిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో వెనక్కి వేయబడింది. ప్రతిపక్ష పార్టీగా మేము అడిగితే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందుతాయి. లేదంటే అమలు అవుతున్న పథకాలు ప్రభుత్వం నిలిపే అవకాశం ఉందని అన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ



చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లు ఆంజనేయులు, రహమాన్, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మాజీ జడ్పీటీసీ నరేందర్, సింగిల్ విండో చైర్మన్ లు రాజేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య గౌడ్, హన్వాడ మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మహబూబ్ నగర్ మండల పార్టీ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులూ, కార్పొరేటర్లు ఇతర నాయకులూ పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు కోసం హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయులు



## పీఆర్‌టీయూటీఎస్ మహాధర్నాకు మహబూబ్‌నగర్ నుంచి భారీగా తరలివెళ్లిన ఉపాధ్యాయులు

సమయం: సెప్టెంబర్ 1, మహబూబ్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, సత్వరమే పీఆర్‌సీ ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వేలాది మంది ఉపాధ్యాయులు తరలివెళ్లారు. పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి మార్గదర్శనంలో రాష్ట్ర అధ్యక్షుడు పులగం శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ ఇచ్చిన పిలుపుతో జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు బయలుదేరారు. జిల్లా అధ్యక్షుడు జి. మదన్‌మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వి. బుచ్చారెడ్డి నేతృత్వంలో ఆయా మండలాల బాధ్యుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వాహనాల్లో తరలివెళ్లారు. మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరిన వందలాది వాహనాలను జిల్లా బాధ్యులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు, పీఆర్‌సీ ప్రకటన వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహాధర్నాను విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన ఉపాధ్యాయులకు జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కమిటీ సభ్యులు లయన్ అశ్విని చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి

## వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీలను తరచూ తనిఖీ చేయాలి






**- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాస్టల్ సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్యాబోధన, భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు. వసతి గృహాలు, పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్త, పిచ్చిమొక్కలు, పొదలను తొలగించి పాములు, విషపురుగులు సంచరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధికారులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేలా వారానికి ఒకసారి మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్లిప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను మెరుగు పరచాలని తెలిపారు. ఆంగ్ల భాషపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ ఆంగ్ల పాఠాలు ప్రారంభించే ముందు 10 నుంచి 15 నిమిషాల పాటు ప్రాథమిక వ్యాకరణ అంశాలను బోధించాలని సూచించారు. విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడే అవకాశాలను కల్పించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, నెలకు ఒకసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు తమ పరిధిలోని వసతి గృహాలు, పాఠశాలలను కనీసం 15 రోజులకు ఒకసారి సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అవసరమైతే విద్యార్థులతో కలిసి బస చేసి సమస్యలను స్వయంగా తెలుసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును అధికారులపై నమ్మకంతో అప్పగిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి సునీత, బీసీ సంక్షేమ అభివృద్ధి సంస్థ అధికారి విష్ణు నందన్, జీసీడీఓ అశ్ర ఖాద్రి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై కేసులన్నింటినీ కొట్టివేసిన సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ, సెప్టెంబర్ 1: జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ (CJP) చేపట్టిన నిరసనల క్రమంలో విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు ఇవాళ రద్దు చేసింది. క్రిమినల్ నేపథ్యం ఉన్న వారి మినహా, జూలై 20 నుంచి 25 వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నమోదైన కేసులన్నింటినీ కొట్టివేస్తూ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో సంతృప్తి చెందిన సీజేపీ, సెప్టెంబర్ 5న ఢిల్లీలో తలపెట్టిన భారీ మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. జూలై 20 నాటి సీజేపీ నిరసనలకు సంబంధించి దాఖలైన కేసులను ఉపసంహరించుకుంటామని, అలాగే ఈ వ్యవహారంలో భవిష్యత్తులో కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని కూడా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. క్రిమినల్ చరిత్ర ఉన్న 2,873 మంది వ్యక్తులపై జంతర్ మంతర్ నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఒక ఎఫ్ఐఆర్‌ను కొనసాగించడానికి కోర్టు అనుమతించింది. జూలై 25న ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ బీహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం (ఢిల్లీ పోలీసులు) సంయుక్తంగా ఎఫ్ఐఆర్‌ల రద్దు కోసం దరఖాస్తులు దాఖలు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మాట్లాడుతూ, ఇరువర్గాలు నమ్మకంతో చర్చించుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. దీనికి మెహతా స్పందిస్తూ, 'మేము శత్రువులం కాదు, సానుకూల దృక్పథంతో సమస్యను పరిష్కరించాం' అని తెలిపారు. NEET-UG 2026 పరీక్ష రద్దు కావడం వల్ల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలు రూపొందించేందుకు మూడు నెలల సమయం కావాలని సొలిసిటర్ జనరల్ కోరగా, సుప్రీంకోర్టు ఆ గడువుకు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, ప్రభుత్వ హామీలు నెరవేరలేదని భావించి సెప్టెంబర్ 5న మార్చ్‌కు పిలుపునిచ్చిన సీజేపీ, సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ తీరును స్వాగతిస్తూ ఆ నిరసన కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసింది.




**హైదరాబాద్, సెప్టెంబర్ 1, సమయం ప్రతినిధి:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు వెళ్లారు. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఆయన సవాల్ చేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, మల్కాజిగిరి మండలం, లోతుకుంట గ్రామంలోని సర్వే నం. 1, 2లోని 40 ఎకరాల భూమిలో గత నెల 17వ తేదీన హైడ్రా కూల్చి వేతలు చేపట్టడాన్ని శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ చేపట్టారు. హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి రంగనాథ్‌ను తప్పించి.. ఆ స్థానంలో మరొకరిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. న్యాయస్థానం ఆదేశాలను విచ్చలవిడిగా ధిక్కరించడంతో పాటు, పదేపదే ఉల్లంఘించే అధికారి రూల్ ఆఫ్ లాను ప్రమాదంలో నెట్టివేసే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి ఆ పదవిలో కొనసాగరాదని వ్యాఖ్యానించారు.

# పదేళ్ల విధ్వంసంకి ప్రజా పాలనతో సమాధానం




(సమయం ప్రతినిధి, దేవరకద్ర) : విధ్వంసానికి గురైన తెలంగాణను వికాసం వైపు నడిపించడం కోసం గడిచిన వెయ్యి రోజుల ప్రజా ప్రభుత్వ పరిపాలనలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నామని దేవరకద్ర నియోజక వర్గ ఎమ్మెల్యే G మధుసూదన్ రెడ్డి GMR చెప్పారు. వెయ్యి రోజుల పాలనలో రైతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు, ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి అనేక సామాజిక అంశాల్లో దూరదృష్టితో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నట్టు వివరించారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడిన తెలంగాణలో గడిచిన వెయ్యి రోజుల్లో రూపాయి రూపాయి కూడబెట్టి ముళ్లబాట నుంచి హైవేకు తీసుకొచ్చాం. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తుంటే, చూసి ఓర్వలేక కొందరు అభివృద్ధికి అడ్డుపడుతున్నారుఒక్కటొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ పరిపాలనను పట్టాలెక్కించాం. ప్రభుత్వాన్ని సాఫీగా నడిపిస్తా. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తా.. అని ఎమ్మెల్యే GMR గారు ఘాటుగా స్పందించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1వ తేదీ నుంచి గడిచిన 32 నెలలుగా ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నాం. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా మొదటి తారీఖున చెల్లించాలని చెప్పాం. ఉద్యోగులు పదవీ విరమణ వయస్సును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచిన కారణంగా ఇప్పుడు నెలకు దాదాపు వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైరవుతున్న భారం పడుతోంది. గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ 8 వేల కోట్లు బకాయి పెట్టింది. వారి బెనిఫిట్స్ కోసం వంద రోజుల్లో రూ. 6 వేల కోట్లు చెల్లించాం. ఆరోగ్య భద్రత కార్డు లేకపోతే ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించాం. తెలంగాణ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా పనిచేసిన ఆర్టీసీ ఉద్యోగుల్లో 60 మంది చనిపోగా, ఆ కుటుంబాలను పట్టించుకోకపోతే ప్రజాప్రభుత్వం వారికి అండగా నిలబడి కారుణ్య నియామకాలు చేపట్టాం. ఈ విషయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలి అని కోరారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు.. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలో 27.50 లక్షల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తున్నాం. నియామకాల కోసం తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన నిరుద్యోగులకు గడిచిన పదేండ్ల పాలనలో ఉద్యోగాలు భర్తీ చేయలేదు. గ్రూప్ 1, 2, 3, 4లతో పాటు డాక్టర్లు, నర్సులు, పోలీసు ఉద్యోగాలు వేటిలోనూ నియామకాలు చేపట్టలేదు. రెండేండ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి, దేశంలో ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను మొదటి స్థానంలో నిలబెట్టాం. ఈ వెయ్యి రోజుల పరిపాలనలో రైతులు, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం రూ. 1 లక్షా 70 వేల కోట్లు ఖర్చు పెట్టింది. 30 నెలల్లో రైతుల వడ్లు కొనడానికి రూ. 90 వేల కోట్లు చెల్లించాం. రూ. 36 వేల కోట్లు రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించాం. 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల మేరకు రుణమాఫీ చేశాం. ఉచిత కరెంటు కోసం 30 వేల కోట్లు ఖర్చు చేశాం. గిట్టుబాటు ధరతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాం. అప్పులు లేని రైతులు తెలంగాణలో ఎక్కువ ఉన్నారని కేంద్రం ప్రకటించింది. రైతుల సంక్షేమం కోసం నిరంతరం తపన పడుతున్నాం. వెయ్యి రోజుల పరిపాలనలో రాష్ట్రం దివాలా తీసిందంటారా? మా ప్రభుత్వ గొప్పతనం ఆడబిడ్డ కళ్లల్లోని వెలుగుల్లో కనిపిస్తుంది. కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించాం. స్వయం సహాయక సంఘాలకు రూ. 60 వేల కోట్లు బ్యాంకు లింకేజీ కల్పించాం. ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యమే కాకుండా వెయ్యి బస్సులకు ఆడబిడ్డలను యజమానులుగా చేశాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి గడిచిన 32 నెలల్లో మహిళల తరఫున ఆర్టీసీకి రూ. 11 వేల కోట్లు చెల్లించాం. సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయిస్తున్నాం. హైటెక్ సిటీ శిల్పారామం వద్ద విలువైన 3.5 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి స్టాళ్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాం. కొత్తగా రేషన్ కార్డులు జారీ చేశాం. 200 యూనిట్ల వరకు ఆడబిడ్డలకు ఉచిత విద్యుత్ అందించాం. రాష్ట్రంలో 1 కోటి 17 లక్షల రేషన్ కార్డులు జారీ చేశాం. 3.48 లక్షల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఆడబిడ్డలకు 7 లక్షల ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చాం. కోర్ అర్బన్ ఏరియా పరిధిలో పేదలకు 1 లక్ష ఇందిరమ్మ ఇండ్లను (అపార్ట్‌మెంట్లు) కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం అని విడమరిచి చెప్పారు. గతంలో పేదల గురించి ఒక్కరోజు కూడా ఆలోచన చేయని వారు ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడుతున్నారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కూలిపోతున్నా పట్టించుకోలేదు. రూ. 2 వేల కోట్ల ఖర్చుతో పూర్తయ్యే ఆసుపత్రిని నిర్మించాలన్న ఆలోచన చేయలేదు. సచివాలయం ఎదురుగా బహుజనుల ఆరాధ్యదైవం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని, చదువులే మన బతుకులు మార్చుతాయని చెప్పిన జ్యోతీరావు పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేశాం. మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు పెట్టాం అని గుర్తుచేశారు. ఇన్ని కార్యక్రమాలు చేసిన ప్రజా ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎలా అంటారు? గత పాలనలో ఆడబిడ్డలు, రైతులు, నిరుద్యోగులకు చేసిందేమిటి? ప్రజలు ఈ తేడాను గమనించాలి. ఆలోచన చేయాలి. వెయ్యి రోజుల పాలనలో ఏం చేశావని అడిగే వారికి 8 వేల రోజుల పాలనలో, వెయ్యి రోజుల ప్రజా పాలనలో చేసిందేమిటన్నది అసెంబ్లీలో చెబుతాం అని అన్నారు. 40 ఏళ్లుగా నానుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాం. 1931 తర్వాత వందేళ్లుగా జరగని కులగణన చేసి లెక్కలు తేల్చాం. గిగ్ వర్కర్స్ సంక్షేమం కోసం చట్టం చేయడం, స్పోర్ట్స్, ఐటీ, హెల్త్, టూరిజం, ఎండోమెంట్ పాలసీలను తీసుకొచ్చాం. అత్యద్భుతంగా సమ్మక్క – సారలమ్మ దేవాలయం నిర్మించుకున్నాం. హైదరాబాద్ నగరం గొప్పగా అభివృద్ధి చెందుతోంది. నగరమే కాదు.. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా ఓఆర్ఆర్ లోపు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా, ఓఆర్ఆర్ అవతలివైపు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగం పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీగా, రీజినల్ రింగ్ రోడ్డు బయటి ప్రాంతాన్ని రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా.. మూడు భాగాలుగా చేసుకుని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నాం. ఇవన్నీ ప్రజా ప్రభుత్వ వెయ్యి రోజుల పరిపాలన విజయం కాదా. మాతో పోలికేంటి? పదేళ్లలో వందేళ్ల విధ్వంసం చేసిన తెలంగాణ రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నాం. పరిపాలన పట్టాలెక్కింది. అభివృద్ధి వైపు నడిచే ప్రయాణంలో ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలబడాలి అని దేవరకద్ర నియోజక వర్గ ఎమ్మెల్యే G మధుసూదన్ రెడ్డి GMR అన్నారు

## రాహుల్ గాంధీపై అక్రమ కేసులకు వ్యతిరేకంగా మహబూబాబాద్‌లో కాంగ్రెస్ భారీ ధర్నా



మహబూబాబాద్ (వేకువ సమయం) సెప్టెంబర్ 01 ప్రతినిధి: మహబూబాబాద్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో బీజేపీ–ఆరెస్సెస్ శ్రేణులు వ్యవహరించిన వివక్షాపూరిత వైఖరిని ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అక్రమంగా ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేయడాన్ని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు చేపట్టిన ఈ ఆందోళనలో ముఖ్య ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్య నాయకుల

### బీజేపీ ఆర్ ఎస్ ఎస్ వివక్షపూరిత కుట్ర

ప్రసంగాలు: రాజ్యాంగ విలువలపై దాడి: అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం, సామాజిక న్యాయం కోసం గళమెత్తిన రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ అక్రమ కేసులు బనాయించిందని నాయకులు మండిపడ్డారు. కేసుల ఉపసంహరణకు డిమాండ్: ఖర్గే సభ ప్రాంగణాన్ని "శుద్ధి" పేరిట అవమానించిన వారిపై చర్యలు తీసుకోకుండా, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం సిగ్గుచేటని, తక్షణమే రాహుల్ గాంధీపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న ప్రముఖులు: ఈ నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళీ నాయక్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ జ్యోతి రమేష్ నాయక్, మహబూబాబాద్ మండల అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస్ కేసముద్రం మండల అధ్యక్షుడు సమ్మీ గౌడ్, ఇనుగుర్తి మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ నాయక్,వారితో పాటు స్థానిక కౌన్సిలర్లు, వివిధ విభాగాల (సెల్స్) అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నూతన పెన్షన్ విధానం రద్దు-పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### భోజన విరామంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన
### రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టో హామీని అమలు చేయాలి

నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (సెప్టెంబర్ 01): నూతన పెన్షన్ విధానం అమలు పరచబడిన తేదీ మొదటి సెప్టెంబర్ దినాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ముందు మంగళవారం ఉద్యోగులు మధ్యాహ్నం విరామ సమయంలో నల్ల బ్యాడ్జి ధరించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల రాజ్యాంగబద్ధ హక్కు, జూూ రద్దు, నూూ ముద్దు అందుకే ఓ పి ఎస్ అమలు చేయాలి అని అన్నారు. టీజీవో పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా నేడు " పెన్షన్ విద్రోహ దినం" ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఈ సందర్భంగా సిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా, పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ పునరుద్ధరించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తూ నిరసన నినాదాలు చేశారు. అదేవిధంగా దేశంలో 1, జనవరి 2004లో నూతన పెన్షన్ విధానము అమలు పరచడం జరిగినది దానిని అనుసరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 1 సెప్టెంబర్ 2004 నుంచి నూతన పింఛన్ విధానాన్ని అమలు పరచడం జరిగినది దానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వులు 653ఊ654తేదీ 22.9.2004 ద్వారా మార్గ




దర్శకాలు విడుదల చేసి నూతన పెన్షన్ విధానాన్ని అమలుపరిచినారు, నూతన పెన్షన్ వల్ల చాలా ఇబ్బందులు పడవలసిన పరిస్థితి వస్తుందని వెంటనే పెన్షన్ రాని న్యూ పెన్షన్ సిస్టంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరసన తెలిపిన ఉద్యోగులు ప్రిన్సిపాల్ రవి ప్రకాష్,టి జి ఓ ఆర్గనైజింగ్ సెక్రటరీ యండి యూనుస్, , పబ్లిసిటీ కార్యదర్శి, రాజేశ్వర్,ఎస్కే షఫీ నరేందర్ గౌడ్, తస్కెన్,హిఫసా,ఖుర్షీద్,శిరీష,సత్యం, మంజుల,రాజయ్య,తుకారం, కిరణ్,కృష్ణయ్య, బాలేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : రెవెన్యూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ (TGEJAC) ఆధ్వర్యంలో మంగళవారం ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.మధ్యాహ్న భోజన

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తహశీల్దార్‌కు వినతి

విరామ సమయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ముఖ్యం గా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల PRC అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయడంతో పాటు, ఇతర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో జిపిఓ రాష్ట్ర అధ్యక్షులు వరదరాజులు, జిపిఓ జిల్లా ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, జిపిఓ మండల అధ్యక్షులు కాశీనాథ్, జిపిఓలు రంజిత్ కుమార్, సుంకల రాము, పరుశరాములు, మహమూద్, నారాయణ, యాదయ్య, జూనియర్ అసిస్టెంట్ అచ్యుత రెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన కమిషనర్




జడ్చర్ల సెప్టెంబర్ 1, సమయం ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నం.278లోని 10 శాతం మున్సిపల్ భూమిలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గిరీష్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటి 'గ్రీన్ జడ్చర్ల-క్లీన్ జడ్చర్ల' లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపడుతున్నట్లుతెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## రోగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన ఉద్యోగి



దేవరకొండ: కొండమల్లేపల్లి: సెప్టెంబర్ 1 (సమయం ప్రతినిధి) :కొండమల్లేపల్లి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్న ఈ వీరబాబు రోగుల పట్ల దాతృత్వం చాటుకున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబి తో బాధపడుతున్న రోగులకు నిత్యవసర సరుకులు ఆరు నెలలకు సరిపోయే ముడి సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ .సైదులు. వసంత .రాణి. రవి .లక్ష్మణ్. తదితరులు పాల్గొన్నారు.

## కీసర రోడ్లపై ప్రమాదాల గుంతలు.. అధికారులు మేల్కొనేదెప్పుడు?

### ప్రధాన చౌరస్తా నుంచి భోగారం రోడ్డు వరకు గుంతలతో వాహనదారులకు ముప్పు.. పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం.

వేకువ సమయం సెప్టెంబర్ 1కీసర ప్రతినిధి :కీసరలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన ప్రమాదకర గుంతలు వాహనదారులు, పాదచారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు పోలీస్ సిగ్నల్ పాయింట్ వద్ద, అలాగే భోగారం రోడ్డులోని శ్రీ మల్లికార్జున పూజ స్టోర్ ఎదుట భారీ గుంత ఏర్పడి చాలా రోజులుగా అలాగే ఉన్నాయి. మరోవైపు భోగారం రోడ్డులోని గుంతకు తాత్కాలికంగా చెక్క దుంగను అడ్డుగా ఉంచడం కనిపిస్తోంది. రాత్రి వేళల్లో ఇది వాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి సమస్య తెలిసినా గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి, గుంతలను శాశ్వతంగా పూడ్చి రోడ్లను సురక్షితంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. "ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగే వరకు వేచి చూడకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలి" అని కోరుతున్నారు.



# మహబూబ్‌నగర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**603 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణపు పనులు**
**9 డివిజన్లలో యూజీడీ పనులకు నేడు భూమిపూజ**
**మూడేళ్లలో నగరమంతా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేస్తాం**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం**

(సమయం ప్రతినిధి,మహబూబ్‌నగర్) : మహబూబ్‌నగర్ నగర ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మహబూబ్‌నగర్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్‌కు చారిత్రక ప్రాధాన్యత ఉందని, మున్సిపాలిటీగా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నగరం 2026లో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిందని తెలిపారు. నగరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలంటే కీలకమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహబూబ్‌నగర్ నగరంలో యూజీడీ వ్యవస్థ ఏర్పాటుకు ఈ ఏడాది ?603 కోట్లు మంజూరయ్యాయని, ముందుగా నగరంలోని తొమ్మిది డివిజన్లలో పనులకు నేడు భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే విడతల వారీగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో యూజీడీ నిర్మాణ పనులు చేపడతామని, రాబోయే మూడు సంవత్సరాల్లో నగరమంతా యూజీడీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మురుగునీటిని శుద్ధి చేయకుండా బయటకు విడుదల చేయకూడదని, ఇందుకోసం మురుగునీటి శుద్ధి కేంద్రాలు (గ్రాలు) ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మురుగునీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేసి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో మహబూబ్‌నగర్ నగరానికి అవసరమైన తాగునీటి సరఫరా, వాటర్ రిజర్వాయర్ల నిర్మాణం తదితర ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న 20 మిలియన్ లీటర్ల సామర్థ్యానికి అదనంగా 18 మిలియన్ లీటర్ల సామర్థ్యాన్ని పెంచుతూ 14 రిజర్వాయర్ల నిర్మాణానికి అనుమతి లభించిందని, ఇప్పటికే 11 రిజర్వాయర్లకు శంకుస్థాపన పూర్తయిందని వెల్లడించారు. నగరానికి అవసరమైన వాటర్ రిజర్వాయర్‌ను మంజూరు చేయడంతో పాటు నీటి సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే మొదటి ఫేస్ లో ?200 కోట్లతో ఐఐటీ కళాశాల నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మరియు ముడా




నిధులతో ?1.50 కోట్లతో ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. నగరాలు కేవలం వాటర్ సప్లై స్కీమ్‌లు, యూజీడీ, పార్కులు, భవనాల నిర్మాణంతో మాత్రమే అభివృద్ధి చెందవని, అక్కడ నివసించే ప్రజలే నిర్మిస్తారని పేర్కొన్నారు. మౌలిక వసతులతో పాటు ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల విద్య, ఆరోగ్యం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, వంటి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పిల్లలకు ఏం కావాలి, వారికి ఎలాంటి సౌకర్యాలు అందడం లేదు, వారు తమ సమయాన్ని ఎలా వినియోగిస్తున్నారు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పిల్లలతో నేరుగా మాట్లాడి వారి అవసరాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పిల్లల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. బలహీన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రత్యేక అవకాశాలు కల్పించడంతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం 35 మంది విద్యా వాలంటీర్లు 30 పాఠశాలల్లో పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించారని, దానిని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 100 మంది విద్యా వాలంటీర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. తనకు బాధ్యత అప్పగించిన దానిని స్వీకరించి, ఆ పనిలోనే నిమగ్నమై పనిచేయడం తన విధానమని, తనకు మరిన్ని పదవులు రావాలన్న ఆలోచన కంటే మహబూబ్‌నగర్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. "నాయకుడు ఎప్పుడూ ఎన్నికల కోసం మాత్రమే ఆలోచించే వ్యక్తి కాదని , నగర భవిష్యత్తు కోసం, రాబోయే తరాల కోసం ఆలోచించే వ్యక్తే నిజమైన ప్రజానాయకుడు" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదం, మిత్రులు, మేధావులు, జర్నలిస్టుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఒక కోటి రూపాయలు అంటే కేవలం ఒక సంఖ్య కాదని, ఆ మొత్తంతో పిల్లల విద్య, ఆరోగ్యం, క్రీడలు తదితర అనేక కార్యక్రమాలు చేపట్టవచ్చని అన్నారు. మహబూబ్‌నగర్ ప్రజల సహకారం, సూచనలు, ఆశీస్సులతో అభివృద్ధి యజ్ఞాన్ని విజయవంతంగా కొనసాగిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల్లో తనపై నమ్మకం ఉంచి మంచి మెజారిటీతో గెలిపించిన మహబూబ్‌నగర్ ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేస్తానని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి. మహేందర్, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, నాయకులు మైత్రి యాదయ్య, మున్నూరు రవి, యాదిరెడ్డి, అబ్దుల్ హక్, గోవింద్ యాదవ్, దాసరి రఘు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల దాడికి నిరసన

**తీవ్రంగా ఖండించిన పద్మ అనిల్ ముదిరాజ్ BJYM కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్.**

కల్వకుర్తి :భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై నిన్న కాంగ్రెస్ దుండగులు చేసిన అప్రజాస్వామిక దాడిగా బిజెపి కల్వకుర్తి నియోజకవర్గం పేర్కొన్నారు. తాను తీవ్రంగా ఖండిస్తున్నానని బీజేపీ నాయకులకు,కార్యకర్తలకు, అభిమానులకు గుడి లాంటి కార్యాలయంపై ఇలాంటి చెర్య బాధాకరం,బిజెపిని ఎదుర్కోలేక పిరికిపందల్లా అల్లరి మూకలతో రాజకీయ పార్టీ కార్యాలయం పై దాడి చేసే విష సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ పెంచి పోషిస్తున్నదన్నారు. నిత్యం ప్రజా స్వామ్యం హక్కులు రాజ్యాంగం అంటూ నీతులు చెప్పే రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ దుండగులు చేస్తున్న దాడిని ఖండించే నైతిక బాధ్యత లేదా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు ఎదురు దాడికి దిగితే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యాలయాలు నలుపు రంగుతో మునిగి తెలుతాయి అనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ దుండగులు గుర్తుపెట్టుకుంటే మంచిది. బిజెపి కార్యాలయం గేట్లపై పూసిన నల్ల రంగు కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వినియోగించుకోలేక రోడ్లపై రెచ్చిపోతూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తే బిజెపి చూస్తూ ఊరుకోదు కబుర్దార్ అని వారు హెచ్చరించారు.

## బీజేపీ కార్యాలయంపై దాడి కాంగ్రెస్ అసహన రాజకీయాలకు నిదర్శనం

**బి.కొండయ్య బీజేపీ రాష్ట్ర నాయకులు మక్తల్ అసెంబ్లీ**

మక్తల్ : హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు బి.కొండయ్య తీవ్రంగా ఖండించారు.ప్రజా సమస్యలపై బీజేపీ ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, దాడులు చేయించడం ద్వారా ప్రశ్నించే గొంతును అణిచివేయాలని చూస్తోంది.ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన ధోరణి.అని బి.కొండయ్య మండిపడ్డారు.అధికారంలో ఉన్న పార్టీకి చేతనైతే అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమం, మెరుగైన పాలనతో ప్రజల ముందుకు రావాలని.ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం ద్వారా ప్రజల ప్రశ్నలకు సమాధానం దొరకదని అన్నారు.బీజేపీని భయపెట్టాలని చూస్తే అది మీ భ్రమ మాత్రమే. బీజేపీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ఆపరు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం"అని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై దాడులకు పాల్పడటం సరికాదని, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం దాని హక్కు, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలపై వెంటనే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారులను బి.కొండయ్య డిమాండ్ చేశారు. దాడులు, బెదిరింపులు, రాజకీయ కక్ష సాధింపులతో బీజేపీని అడ్డుకోలేరు. ప్రజల కోసం ప్రశ్నించే ప్రతి గొంతుకకు బీజేపీ అండగా ఉంటుంది.కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలి... ప్రతిపక్షంపై దాడులపై కాదు" అని బి.కొండయ్య హెచ్చరించారు.

## శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం
## అనుమతి లేని సభలు, ర్యాలీలపై కఠిన చర్యలు : ఎస్పీ

**సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జిల్లాలో "30 పోలీస్ యాక్ట్-1861" అమలు**
**ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, భారీ సమావేశాలకు అనుమతి లేదు**
**ప్రశాంత వనపర్తి కోసం ప్రజలందరూ పోలీసుశాఖకు సహకరించాలి**




వనపర్తి, సెప్టెంబర్ -01: జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగించడం, ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, అవాంఛనీయ సంఘటనలను ముందస్తుగా నివారించడం లక్ష్యంగా సెప్టెంబర్ - 1 నుంచి సెప్టెంబర్ - 30 వరకు "30 పోలీస్ యాక్ట్-1861" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పరిధిలో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలి గించే అవకాశమున్న ఎలాంటి కార్యక్రమమైనా సంబంధిత పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, నిరసన కార్యక్రమాలు, భారీ స్థాయి సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను పోలీసులు ఏమాత్రం ఉపేక్షించబోరని, "30 పోలీస్ యాక్ట్" నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రశాంతత మరియు సామాజిక శాంతిని పరిరక్షించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించదలచినట్లయితే సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు. చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుని బాధ్యత అని, ప్రజల సహకారంతోనే జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేయగలమని ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక

వనపర్తి : జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, తెలిపారు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా 13 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

1. అధ్యక్షులు: గోవిందు, హెడ్ కానిస్టేబుల్, ఐటీ సెల్, వనపర్తి
2. ఉపాధ్యక్షులు-1: అప్పలనాయుడు, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్
3. ఉపాధ్యక్షులు-2: జయన్న, ఎస్సై, ఆత్మకూరు
4. కార్యదర్శి: నాగరాజు, ఏఆర్ఎస్సై, ణూ=, వనపర్తి
5. జాయింట్ సెక్రటరీ: సురేందర్, కానిస్టేబుల్, వీపనగండ్ల పోలీస్ స్టేషన్
6. ఆర్గనైజింగ్ సెక్రటరీ: మధు, కానిస్టేబుల్, శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్
7. కోశాధికారి: రాజశేఖర్, కానిస్టేబుల్, వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్

కార్యవర్గ సభ్యులుగా

8. రమేష్ బాబు, ఏఆర్ కానిస్టేబుల్, వనపర్తి
9. ఆంజనేయులు, పీఆర్ కానిస్టేబుల్, వనపర్తి
10. అశోక్ నాయుడు, కానిస్టేబుల్, మదనాపూర్
11. బాలయ్య, కానిస్టేబుల్, మదనాపూర్ పోలీస్ స్టేషన్
12. నాగలక్ష్మి, మహిళా కానిస్టేబుల్, ఆత్మకూరు పోలీస్ స్టేషన్
13. సుజాత, మహిళా కానిస్టేబుల్, గోపాల్పేట్ పోలీస్ స్టేషన్

నూతన కార్యవర్గానికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించడాన్ని అభినందించారు. నూతన కార్యవర్గం పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు,



వారి సాధకబాధకాలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను సంఘం ప్రతినిధులు తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని ఎస్పీ తెలిపారు. సిబ్బంది సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, హక్కులు మరియు అవసరాల కోసం కృషి చేయాలని ఎస్పీ సూచించారు. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత, నిబద్ధతతో వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా లేదా చట్ట విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. పోలీస్ అధికారుల సంఘం కార్యకలాపాలు పోలీస్ శాఖ నిబంధనలు, చట్టపరమైన పరిధిలోనే కొనసాగాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, ఐక్యత, సమన్వయం కోసం నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేస్తుందని జిల్లా ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డిసిఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేయాలి....

**గట్టు సబ్ స్టేషన్ దగ్గర రైతులు చేస్తున్న ధర్నా కు సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్**

(సమయం ప్రతినిధి గద్వాల): గద్వాల నియోజకవర్గం గట్టు మండల కేంద్రంలో సబ్ స్టేషన్ ఆఫీస్ దగ్గర గట్టు మండలం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేయాలని నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ తరఫున బాసు హనుమంతు నాయుడు గారు పాల్గొని, సంఘీభావం తెలిపారు.... అనంతరం,మండల కరెంట్ AE చెన్నయ్య కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మండలంలోని కొంతకాలం నుండి కరెంటు వ్యవసాయ సాగుకు (3 Phase) కోతలు విధిస్తున్నారు అని అన్నారు.24 గంటలు ఉండాల్సిన కరెంటు 12 గంటలు మాత్రమే ఉంటుంది అని దీనికి కారణం మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు..కరెంట్ కోసం తెలంగాణ రాక ముందు ధర్నాలు చేస్తే,మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం లో చేయాలివస్తుంది అని అన్నారు...వ్యవసాయ పొలాలకు గత కెసిఆర్ ప్రభుత్వం 10 ఏళ్లు 24 గంటలు అందిచ్చిందని గుర్తు చేశారు.... ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, పైగా ఆ 12 గంటల సమయంలో కూడా మధ్య మధ్యలో కరెంటు కోతలు ఉండడం ద్వారా రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటల పాటు కరెంటు ఉంటూ రైతు తనకు ఇష్టం వచ్చినప్పుడు తన పొలానికి నీటిని మళ్లించుకునేవాడు, కానీ నేడు ఈ కరెంటు కోతల వల్ల వేసుకున్న పంటలను ఎండ కొట్టుకునే పరిస్థితి వచ్చింది అని,పైగా ఎల్నినో



ప్రభావంతో వర్షాలు కూడా ఈ సంవత్సరం రైతులకు సహకరించడం లేదు, దీనివల్ల పంటలు ఎండుతున్నాయి అని అన్నారు. వెంటనే,విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రైతులకు 24 గంటలు కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మెన్ రాముడు, ఎస్.రాము నాయుడు, గద్వాల తిమ్మప్ప,ఉప సర్పంచు బాసు గోపాల్,తీం వెంకటేష్,రాజు నాయుడు,జగదీష్,కంగారు తిమ్మప్ప, రాముడు, మల్లికార్జున్,నరసింహులు,రమేష్,నాగరాజు, పరశురాముడు,భీమేష్, లక్ష్మణ,రంగస్వామి, తిమ్మప్ప, వీరేష్, రామాంజనేయులు,ఆంజనేయులు,మరియు నాయకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు....

## ఐఅండ్‌పీఆర్ జేడీ జగన్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి
## నూతన బాధ్యతల్లో రాణించాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతల అభినందనలు

సమయం: సెప్టెంబర్ 1, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్ అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందడంపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు అభినందనలు తెలిపారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో జగన్‌ను ఫెడరేషన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె. పాండురంగారావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా నాయకులు నంబి పర్వతాలు, గోవింద్ నాయక్, ఎం. రవికుమార్ తదితరులు జగన్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ సమాచార,



పౌరసంబంధాల శాఖలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన డి.ఎస్. జగన్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించడం అభినందనీయమన్నారు. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకెళ్లిన సోమయ్య, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ ద్వారా అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే బలమైన భారత్ నిర్మాణం

## పోషకాహారంపై విద్యార్థులు, యువత చైతన్య సారథులు కావాలి: డాక్టర్ కె. లక్ష్మణ్






సమయం, సెప్టెంబర్ 1, హైదరాబాద్ : చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం దేశ భవిష్యత్తుకు పునాది అని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే బలమైన, ఆరోగ్యవంతమైన భారత్‌ను నిర్మించగలమని పేర్కొన్నారు. దేశ నిర్మాణం అంటే కేవలం ఇటుకలు, సిమెంట్‌తో భవనాలు నిర్మించడం కాదని.. ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దడమే అసలైన దేశ నిర్మాణమని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ గగన్‌మహల్‌లోని ఏవీ కళాశాల ప్రాంగణంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిపోషణ మాసోత్సవం-2026 ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ (ఐకాప్)ను మంగళవారం డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన సందర్శించారు. ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంచేందుకు సీబీసీ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. పోషకాహారంపై విద్యార్థులు, యువత చైతన్య సారథులుగా మారాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, చిన్నారులతో పాటు సమాజంలోని వెనుకబడిన వర్గాలకు సరైన ఆహారం, పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలని సూచించారు.

### పోషకాహార లోపంపై ప్రత్యేక దృష్టి

రక్తహీనత, తక్కువ బరువు, అధిక బరువు, ఊబకాయం, వయస్సుకు తగిన ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని లక్ష్మణ్ అన్నారు. ఇలాంటి ప్రజా అవగాహన కార్యక్రమాలను విద్యార్థులు ప్రాజెక్టులుగా చేపట్టేలా కళాశాలలు ప్రోత్సహించాలని సూచించారు. దేశవ్యాప్తంగా దాదాపు 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు, సుమారు 9 కోట్ల మంది చిన్నారులను ప్రభుత్వం డిజిటల్ విధానాల ద్వారా పర్యవేక్షిస్తోందని తెలిపారు. 11 లక్షలకు పైగా పాఠశాలల్లో దాదాపు 12 కోట్ల మంది చిన్నారులకు ప్రతిరోజూ వేడిగా వండిన భోజనం అందుతోందని చెప్పారు. తెలంగాణలో వయస్సుకు తగిన శారీరక ఎదుగుదల లేని చిన్నారుల నిష్పత్తి 33 శాతం నుంచి 27 శాతానికి తగ్గడం సానుకూల పరిణామమని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషితో పాటు ప్రభుత్వ సహకారం వల్ల ఈ పురోగతి సాధ్యమైందన్నారు.

### చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహార పద్ధతులను ప్రోత్సహించాలని డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. చిరుధాన్యాల్లో ఉన్న పోషక విలువలు ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడంతో పాటు చిన్న, వర్షాధార రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన చిరుధాన్య ఆధారిత పోషకాహార ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన అభినందించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారిగానే కాకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణలు, అంకుర సంస్థల అవకాశాలను అన్వేషించాలని విద్యార్థులకు సూచించారు.

ఆహారంతో పాటు వ్యాయామం, యోగా అవసరం పోషకాహారంతో పాటు శారీరక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని లక్ష్మణ్ అన్నారు. విద్యార్థులు క్రీడలు, వ్యాయామం, యోగా వంటి కార్యకలాపాలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం, యోగాతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

### ప్రజల్లోకి పోషకాహార సందేశాలు

పీఐబీ/సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ మాట్లాడుతూ పోషకాహారం అంటే కేవలం ఆహారం మాత్రమే కాదని, ఆరోగ్యం, ఉత్పాదకత, అభ్యాసం, జీవన నాణ్యతతో ముడిపడి ఉన్న అంశమని అన్నారు. ఒగ్గుకథ, వీధి నాటకం, కోలాటం, యక్షగానం వంటి సంప్రదాయ కళారూపాల ద్వారా పోషకాహార సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సీబీసీ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ రెడ్డి, ఏవీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఐదు రోజులపాటు కార్యక్రమాలు

సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు ఐదు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 40 పోషకాహార సమాచార ప్యానెళ్లతో ప్రదర్శన, నిపుణుల ప్రసంగాలు, ఐఈసీ స్టాళ్లు, వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంప్రదాయ జానపద కళారూపాల ద్వారా పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు సందేశాలు అందించనున్నారు.

# దళితుల భూమి అక్రమంగా దోచుకున్న దగారెడ్డి (మేఘారెడ్డి) ఎమ్మెల్యే

## ఎమ్మెల్యేపై ఎస్సీ.ఎస్టీ కేసు నమోదు చేయాలి



నిరంజన్ రెడ్డి మీద మూడేండ్లుగా నిరాధార ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే బహిరంగ క్షేమాపణ చెప్పాలి.
ఎమ్మేల్యేపై చర్యలకై ఎస్.పి గారికి వినతిపత్రం సమర్పించిన నాయకులు.
అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

వనపర్తి : ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎన్నికలలో అభివృద్ధి ప్రదాత నిరంజన్ రెడ్డి గారిపై లేనిపోని దుష్ప్రచారాలు చేసి గెలిచి నేటికి ఆరోపణలు రుజువు చేయలేకపోవడం వల్ల వెంటనే ముక్కునేలకు వ్రాసి బహిరంగ క్షేమాపణ చెప్పాలని మాజీ ఎం.పి.పి కృష్ణానాయక్,ప్రధాన కార్యదర్శి గంధం.పరంజ్యోతి,నాయకులు ఎం.రాజశేఖర్,దొడ్ల.రాములు, జాత్రు నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దళితుల లావణ్ణి పట్టాను అధికారుల సహకారంతో భాజప్తా పట్టగా చేసుకొన్న దళిత ద్రోహి మేఘారెడ్డి. దళితులకు ప్రభుత్వాలు అసైన్డ్ భూములకు లావణ్ణి పట్టా ఇచ్చి క్రయవిక్రయాలు జరపరాదని నిబంధన పెట్టింది. రాజ్యాంగంలో POT క్రింద నిషేధం ఉంటది. ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకొని అధికారులపై ఒత్తిడి తెచ్చి 0.39గుంటల నిషేధిత భూమి పట్టా చేయించుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన. ఎమ్మెల్యే మేఘారెడ్డి వెలుటూరు శివారులో(నేషనల్ హైవే)కు దగ్గరలో సర్వే. నం.517/A 2లో 0.39గుంటలు రిజిస్ట్రేషన్ చేయించుకొని రెవెన్యూ రికార్డులలో పట్టా మార్పిడి చేయించుకున్నాడు. అదేవిధంగా దోడగుంటపల్లి,అంకూరు నడుమ సోలార్ ప్లాంట్ కోసం ప్రథమేష్ సోలార్ ఫార్మ్ కు ఎమ్మెల్యే దళారిగా వ్యవహరించి ఎస్సీల లావణ్ణి పట్టాభూమి 5ఎకరాల 10గుంటల భూమి ధారాదత్తం చేయించి భారీగా కమిషన్లు పొందారు. ప్రథమేష్ సోలార్ ఫార్మ్ కు సర్వే. నం.548/ఆ2, 548/ఇ4, 548/ఇ5, 548/ఇ3, 548/ఇ2, 548/ఇ1 కు చెందిన 5ఎకరాల 10గుంటలు లావణ్ణి పట్టాభూమి రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వే చేస్తే నిజాలు బయటకు వస్తాయి. ఎమ్మెల్యే మేఘారెడ్డిపై ఎస్.పి గారికి ఫిర్యాదు. దళితుల భూమి అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్.పి కి ఫిర్యాదు చేయడం జరిగింది. అదేవిధంగా అఫిడవిట్ లో తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యేపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయించడం జరిగింది. నీతిమంతునిగా చాలామణి అవుతూ నిత్యం ప్రత్యర్థులపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్న ఎమ్మెల్యే అవినీతి,అక్రమాలు రోజుక్కొకటి డైలీ సీరియల్ లా బయట పెడతామని నాయకులు హెచ్చరించారు. ఎమ్మెల్యేపై అన్ని ఆధారాలతో మేము సిద్ధంగా ఉన్నాం కాబట్టి ఎమ్మెల్యే స్వయంగా స్పందించాలి అని పార్టీకి ముడిపెట్టి బయటపడాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తే నేరం చేసినట్లే అని కృష్ణా నాయక్,రాజశేఖర్, దొడ్ల.రాములు,గంధం పరంజ్యోతి, జాత్రు నాయక్ అన్నారు. ఈ సమావేశములో చంద్రశేఖర్ నాయక్,ఎద్దుల. సాయికుమార్, వసంత్,జూదం. వెంకటేష్,పీన్యా నాయక్ , నారాయణ నాయక్,కవితా నాయక్,సర్పంచులు శోభా,రాజమ్మ,గోవిందు నాయక్, శాంతయ్య, శాంతన్నా,దేవకుమార్,చైతన్య నాయక్,మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నో ఏళ్ల కలకు శ్రీకారం



మక్తల్ నియోజకవర్గ మంత్రి వర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి గారి ఆదేశానుసారం ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న భూత్పూర్ శ్రీ బద్దిపల్లి ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి భూత్పూర్ మీదుగా కాట్రేవ్పల్లి వెళ్లే ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉండేది కానీ నేటితో ఆ కల నెరవేరింది భూత్పూర్ నుంచి కాట్రేవ్పల్లి వరకు బీటీ రోడ్డు పనులను పంచాయతీరాజ్ అధికారులు డీఈ ఏఈ ప్రారంభించారు. ఇందులోభూత్పూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ కె కుర్మయ్య గౌడ్ సర్పంచ్ సంగీత శేఖర్ గౌడ్, వార్డు మెంబర్స్ ,గ్రామ పెద్దలు భూత్పూర్ కాట్రేవ్పల్లి కాంగ్రెస్ నాయకులు పాల్గొని మంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోవు రోజులో ఇంకా ఎన్నో అభివృద్ధి పనులకు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

# నాడు అవమానాలు.. నేడు సహనం: గద్వాల రాజకీయాల్లో మారిన సమీకరణాలు

గద్వాల : గద్వాల రాజకీయాల్లో గతాన్ని ఒకసారి పరిశీలిస్తే నాటి పరిస్థితులు, నేటి పరిస్థితుల మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఒకప్పుడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న డీకే అరుణను కొన్ని కార్యక్రమాల్లో వేదికపైకి జెడ్పిటిసి గా ఉన్న బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని ఆహ్వానించకుండా అవమానించిన సందర్భాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అదేవిధంగా కృష్ణమోహన్ రెడ్డి జెడ్పీటీసీగా ఉన్న సమయంలో కూడా పలు కార్యక్రమాల్లో వేదికపైకి ఆహ్వానించకుండా నిర్లక్ష్యం చేసిన సందర్భాలు ఉన్నాయని గద్వాల ప్రజలు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో రాజకీయ విభేదాలు, ఆధిపత్య ధోరణులు బహిరంగంగానే కనిపించేవని వారు చెబుతున్నారు. అయితే కాలం మారింది.. రాజకీయ పరిస్థితులు మారాయి.. వ్యక్తుల హోదాలు కూడా మారాయి. నేడు ఎమ్మెల్యేగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి గత అనుభవాలను పక్కనపెట్టి సంయమనంతో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. గద్వాల ప్రాంత రాజకీయాల్లో తనకు ఎదురైన అనుభవాలను వ్యక్తిగతంగా తీసుకోకుండా, ప్రజా ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగడం రాజకీయ పరిపక్వతకు నిదర్శనమని గద్వాల ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో ఎవరు ఎలా వ్యవహరించారు అన్నది చరిత్రలో భాగమే. కానీ నేడు అధికార, రాజకీయ పరిస్థితులు మారిన సమయంలో కూడా ప్రతీకార రాజకీయాలకు దూరంగా ఉండి సహనంతో వ్యవహరించడం ప్రజా జీవితంలో ఉన్న నాయకుడికి అవసరమైన లక్షణమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నాడు జరిగిన అవమానాలకు ప్రతీకారం కాకుండా.. నేడు సహనంతో వ్యవహరించడం ద్వారా రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారా? అన్న చర్చ గద్వాల రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# చిన్నారులకు టీకాలు వంద శాతం అందించాలి



సమయం: సెప్టెంబర్ 1, మహబూబ్‌నగర్ : చిన్నారులను ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించడంతో పాటు శిశు మరణాలను తగ్గించి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించేందుకు నిర్దేశిత సమయంలో పిల్లలకు వ్యాధినిరోధక టీకాలను వంద శాతం అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు ఆదేశించారు. ప్రతి నెల మొదటి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో నిర్వహించే 'ఆశ డే' కార్యక్రమంలో భాగంగా నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించి సమీక్షించారు. ఈ నెల అవగాహన అంశంగా 'చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు'పై ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలకు పుట్టినప్పటి నుంచి 16 సంవత్సరాల వయస్సు వరకు నిర్దేశించిన సమయాల్లో అన్ని టీకాలు తప్పనిసరిగా అందేలా వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, పొగాకు, డ్రగ్స్ వంటి వ్యసనాల కారణంగా 30 సంవత్సరాలు పైబడిన వారిలో అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసాంక్రమిక వ్యాధులు అధికంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వీటిని ముందుగానే గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, సకాలంలో చికిత్స అందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ నిల్వ కేంద్రం, రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డా. శ్రావణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహ, డీపీవో సీతారామ్ గౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్ట్ లతో ఉద్యమాన్ని ఆపలేరు

## నాగిళ్ళ ఆంజనేయులు బీజేపీ నేరేడుగోమ్ము మండల అధ్యక్షులు

దేవరకొండ: నేరేడుగొమ్ము: సెప్టెంబర్ 1 (సమయం ప్రతినిధి) : నిన్న సాయంత్రం కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో ఇల్లు ధ్వంసం చేయబడటంతో పాటు, ఆయన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆయన తల్లి పై భౌతిక దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు డా. వర్షిత్ రెడ్డి ని పరామర్శించేందుకు నల్గొండకు వెళ్లాల్సి ఉంది. అయితే, ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, అందుకు బదులుగా బీజేపీ నేరేడుగోమ్ము మండల అధ్యక్షులు నాగిళ్ళ ఆంజనేయులు ని హౌస్ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కీ తీసుకెళ్లారు నల్గొండకు వెళ్లకుండా అడ్డుకుంది. దాడికి గురైన బీజేపీ కుటుంబానికి అండగా నిలిచేందుకు వెళ్లకుండా ఆయనను నిర్బంధించడం జరిగింది అరెస్ట్ అయినా వారిలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గుండ్లపల్లి వెంకటేష్, సీనియర్ నాయకులు ఐతరాజు కొండల్ పాల్గొన్నారు.



# మైనారిటీ మహిళలకు 'ఇందిరమ్మ' చేయూత





**వేకువ సమయం సెప్టెంబర్ 1, కీసర ప్రతినిధి:** మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా మహిళలకు ఆర్థిక సహాయం అందించి స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

**225 మంది మహిళలకు ఆర్థిక సాయం**

జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద 225 మంది మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం ద్వారా పథకం అమలులో పారదర్శకత పాటిస్తున్నామని తెలిపారు.

**57 మందికి జనరేటర్లు, టూల్‌కిట్లు**

తుర్క కాశీ ముస్లిం వర్గానికి చెందిన కులవృత్తిదారులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో 57 మంది లబ్ధిదారులకు రూ.60 వేల విలువైన జనరేటర్లు, టూల్‌కిట్లను అందించారు. వీటి ద్వారా స్వయం ఉపాధి పొందుతూ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు.

**225 మంది మహిళలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం - మంత్రి శ్రీధర్‌బాబు**

**మహిళలు ఆర్థికంగా ఎదగాలి**

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహిళల చేతుల్లోకి వచ్చే ఆర్థిక సహాయం కుటుంబ అభివృద్ధికి దోహదపడుతుందని, వారిని ఆర్థికంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా ప్రభుత్వం సహకరిస్తోందన్నారు.

**ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం**

గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మేడ్చల్ జిల్లా, ఐజజ అధ్యక్షుడు, తోటకూర వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సంక్షేమ పథకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**పెన్షన్లు.. ట్రైసైకిళ్ల మంజూరులో అక్రమాల ఆరోపణలు**
**జిల్లాస్థాయి స్వతంత్ర విచారణకు డిమాండ్**

సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1: వికలాంగుల పెన్షన్లు, ట్రైసైకిళ్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరులో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. కోయిలకొండ మండలం గార్లపహాడ్ గ్రామానికి చెందిన కొత్తఇడిగి కృష్ణయ్యకు మంజూరైన వికలాంగుల పెన్షన్, ట్రైసైకిల్ తదితర ప్రభుత్వ ప్రయోజనాలతో పాటు, ఆయన భార్య సత్యమ్మకు మంజూరైన పెన్షన్‌కు సంబంధించిన అర్హతలను పరిశీలించాలని ఫిర్యాదులో కోరారు. ఇందుకు సంబంధించిన వైద్య ధ్రువీకరణ పత్రాలు, మెడికల్ బోర్డు రికార్డులు, కుటుంబ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గార్లపహాడ్, అంగంపేట, కానాయిపల్లి, దమాయిపల్లి తదితర గ్రామాల్లో అర్హత లేని వారికి వికలాంగుల పెన్షన్లు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు అందుతున్నాయన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. కొందరి నుంచి డబ్బులు వసూలు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మంజూరు చేయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై జిల్లాస్థాయి స్వతంత్ర అధికారులతో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఫిర్యాదుదారు కోరారు. ఆరోపణలు నిజమని తేలితే అక్రమంగా పొందిన ప్రభుత్వ ప్రయోజనాలను రద్దు చేసి, ప్రభుత్వ నిధులను రికవరీ చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## జాతీయ రహదారి వెంట పరిశుభ్రత పనులు వేగవంతం చేయాలి



సమయం: సెప్టెంబర్ 1, మహబూబ్‌నగర్ : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి వెంట చేపడుతున్న పరిశుభ్రత, సుందరీకరణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారి వెంట కొనసాగుతున్న శుభ్రత పనులతో పాటు రహదారి మధ్యలోని మీడియన్‌లో మొక్కల పెంపకం, బారికేడింగ్, గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత తదితర పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి పరిసరాలు పరిశుభ్రంగా, సుందరంగా కనిపించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. జాతీయ రహదారి వెంట గుర్తించిన శుభ్రత పనులు, మొక్కలు నాటడం, బారికేడింగ్, గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులన్నింటినీ రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

## తూకపు యంత్రాలకు ధ్రువీకరణ ముద్రలు తప్పనిసరి.

**ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలకు ధ్రువీకరణ ముద్రలు తప్పనిసరి అని జిల్లా తూనికలు, కొలతల అధికారి రవీందర్ అన్నారు.**




సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని పలు మటన్, చికెన్ దుకాణాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా వినియోగదారులు కొనుగోలు చేసిన మటన్, చికెన్‌ను పునఃతూకం వేసి, దుకాణదారులు ఇచ్చిన బరువును సరిచూశారు. ఈ సందర్భంగా తూకంలో ఎలాంటి వ్యత్యాసాలు గుర్తించలేదని తెలిపారు. అయితే, దుకాణాల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ త్రాసులను తనిఖీ చేయగా, ధ్రువీకరణ ముద్రలు లేని తూకపు యంత్రాలును వినియోగిస్తున్నట్లు గుర్తించడంతో 5 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దుకాణ యజమానులు వినియోగదారులకు సరైన తూకం అందించాలని, ఎలక్ట్రానిక్ త్రాసులను తనిఖీ చేయించి ధ్రువీకరణ ముద్ర వేయించుకోవాలని ఆదేశించారు. అలాగే వినియోగదారులు తూకాన్ని సరిచూసుకునేందుకు ప్రతి త్రాసు వద్ద ప్రమాణ బరువులను అందుబాటులో ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో తూనికలు, కొలతల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000రోజుల విఫల పాలనపై బి.ఆర్.ఎస్ సమర భేరి

**విన్నూత్న నిరసనలతో 6గ్యారంటీలు,420హామీల అమలుకై డిమాండ్**
**మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి**



వనపర్తి : మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈరోజు జిల్లా పార్టీ కార్యాలయం లో కాంగ్రెస్ 1000రోజుల పాలన విఫలమై 8రోజులపాటు బి.ఆర్.ఎస్ పార్టీ చేబట్టబోయే ఆందోళన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడు తూ కె.సి.ఆర్ హయాములో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని మార్పు పేరిట అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి 1000రోజుల పాలనలో సంక్షేమం మాయమై విధ్వంస పాలన సాగుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ మొద్దు నిద్రను తట్టిలేపి ఇచ్చిన 6 గ్యారంటీలు, 420హామీలు,11డిక్లరేషన్లు అమలు చేసేదాకా పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలలో రైతులకు రైతు భరోసా కింద 4ఎకరాల రైతుకు 1,02000వేల రూపాయలు,రుణమాఫీ కింద 2లక్షలు బకాయి పడ్డారు.పంటకు బోనస్ కిందా ఎకరాకు 75వేలు,రైతు కూలీలకు 24000, నిరుద్యోగ భృతి1లక్ష 32వేలు, విద్యా బరోసా 5లక్షలు, ఆటో కార్మికులకు 24వేలు,ప్రతి మహిళకు 82,500,వృద్ధులకు,బీడీ కార్మికులకు,దివ్యాంగులకు66000,కళ్యాణ లక్ష్మి షాధిముబారక్ తులం బంగారం బాకీ,విద్యార్థినులకు స్కూటీ బాకీ,ఫీజ్ రియాంబర్స్మెంట్ 12వేల కోట్లు బకాయి పడ్డదని మన పోరాటం ద్వారా ప్రజలకు బకాయిపడ్డ రూపాయలు ఇచ్చేదాకా పోరాడాలని పిలుపు నిచ్చారు. "సర్"పై సమీక్ష నియోజకవర్గంలో బి.ఆర్.ఎస్ పార్టీ బి.ఎల్.ఏలు, నాయకులు ఓటర్ జాబితా సవరణలో క్రియాశీలకంగా పనిచేశారని అభినందించారు. లక్ష్యం ముగిసిం దని ఏమర్పాటును వీడి ఓటర్లకు వచ్చిన నోటీసుల పట్ల అప్రమత్తంగా ఉండి నోటీసుల పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ బి. లక్ష్మయ్య,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్, మాజీ ఎంపీపి కృష్ణా నాయక్ మాజీ జెడ్.పి.టి. సి కర్రెస్వామి, కౌన్సిలర్.మురళీ సాగర్,మండల పార్టీ అధ్యక్షులు కె.మాణిక్యం,గంధం. పరంజ్యోతి,రాళ్ళ.కృష్ణయ్య, వనం. రాములు, దిలీప్ రెడ్డి, అల్వాల. వెంకట్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి,సర్పంచులు శోభా, తిరుపతయ్య, శేఖర్, నాగమ్మ, చిట్యాల.రాము తదితరులు ఉన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ దాడికి నిరసనగా అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



అచ్చంపేట: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై నిన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడాన్ని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ యువమోర్చా (BJYM) అచ్చంపేట శాఖ ఆధ్వర్యంలో నేడు అచ్చంపేట పట్టణ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ నాయకులు మంగ్య నాయక్ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి పిరికిపంద చర్య అని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీల కార్యాలయాలపై దాడులు చేయడం, ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాల గొంతును అణచివేయడానికి పోలీసు వ్యవస్థను ఉపయోగించుకోవడం, రాజకీయ ప్రత్యర్థులపై దాడులను ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని, దాడులకు భయపడకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దాడులను కొనసాగిస్తే తగిన రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని, తెలంగాణలో బీజేపీ శక్తి ఏమిటో కాంగ్రెస్ నాయకత్వం గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం బీజేపీ, BJYM నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమం అనంతరం పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అరెస్టులు, కేసులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై మరియు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ అచ్చంపేట పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, BJYM రాష్ట్ర నాయకులు చందు లాల్ చౌహాన్, శివ చంద్ర, రేనయ్య, బయ్య రాజు, అమర్, ఎన్. రాజు, శ్రీకాంత్, శివ, అజయ్ తదితర బీజేపీ, దీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కొనసాగింపుపై హైకోర్టు కీలక ఆదేశాలు..!!







సమయం ప్రతినిధి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. ఈ పథకాల అమలుపై హైకోర్టు సింగిల్ ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయగా.. ఈరోజు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కాగా, ధర్మాసనం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది.కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని వివరించారు. దీంతో, అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగించేందుకు మార్గం సుగమం అయింది.

# దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో 5 పడకల నుంచి 10 పడకలకు డయాలసిస్ కేంద్రం విస్తరణ - సదరం క్యాంపు, అంబులెన్స్ ప్రారంభం

**దేవరకొండ: సెప్టెంబర్ 1 (సమయం ప్రతినిధి) :** త్వరలో దేవరకొండలోనే వెహికల్ రిజిస్ట్రేషన్ సేవలు.. కొత్త మండలాలకు ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయాలు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దేవరకొండ, సెప్టెంబర్ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకొండ నియోజకవర్గంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు, ప్రభుత్వ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా పలు కీలక కార్యక్రమాలు చేపట్టినట్లు దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 5 పడకల సామర్థ్యంతో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని 10 పడకలకు విస్తరించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్ గారు, ణవీనూా, =ణూా, వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు పెంచడంతో పాటు, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దివ్యాంగులకు సదరం సేవలు ఇక దేవరకొండలోనే దివ్యాంగులు పింఛన్ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన సదరం సర్టిఫికెట్ కోసం గతంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని దీనివల్ల దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యను గుర్తించి, దివ్యాంగులకు సేవలను వారి ఇంటి ముంగిటకు తీసుకువచ్చే ఉద్దేశంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోనే వారానికి రెండు రోజులు సదరం క్యాంపులు నిర్వహించే విధంగా ప్రత్యేక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులతో కలిసి ప్రారంభించినట్లు చెప్పారు. దివ్యాంగులు సర్టిఫికెట్ కోసం నల్లగొండకు వెళ్లాల్సిన పరిస్థితి ఇక ఉండకూడదు. ప్రయాణ ఖర్చులు, సమయం, శారీరక ఇబ్బందులు తగ్గించి.. ప్రభుత్వ సేవలు వారికి మరింత చేరువ చేయాలన్నదే మా




ఉద్దేశం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ప్రారంభం అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో (ఆర్టిఏ) ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలనుఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ , ఆర్డీవో, వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర వైద్య పరిస్థితుల్లో ఒక్క నిమిషం కూడా ఎంతో విలువైనదని, రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రోగుల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వ వైద్య వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ఉండాలని, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేవరకొండలో వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధితో తనకు ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి కృషి చేశానని తెలిపారు. అనంతరం ప్రభుత్వ స్థాయిలో జరిగిన ప్రయత్నాలతో ఆసుపత్రి విస్తరణకు మార్గం సుగమమైందన్నారు. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దేవరకొండ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి విస్తరణకు కృషి చేశాను. ఇప్పుడు మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని మరింత బలోపేతం చేస్తున్నాం. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు అని బాలు నాయక్. అన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలు మరింత చేరువ కావాలి దేవరకొండ నియోజకవర్గంలో పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఆర్డీవో కార్యాలయం మిర్యాలగూడలో ఉండగా, దేవరకొండకు ఆర్ డి ఓ కార్యాలయం తీసుకురావడానికి తాను చేసిన కృషి ఫలించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖల కోసం వేర్వేరు ప్రాంతాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే చోట అన్ని శాఖల సేవలు అందే విధంగా ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాల సముదాయాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వాహన రిజిస్ట్రేషన్ సేవలు కూడా దేవరకొండలోనే ప్రస్తుతం దేవరకొండ నియోజకవర్గ ప్రజలు వాహనాల రిజిస్ట్రేషన్ తదితర పనుల కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల ప్రజలకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.దేవరకొండ ప్రజలు వాహన రిజిస్ట్రేషన్ కోసం మిర్యాలగూడకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దేవరకొండలోనే ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేశాం. త్వరలోనే దేవరకొండ లోనే సంబంధిత కార్యాలయాన్ని ఏర్పాటు చేసి సేవలు అందిస్తాం అని తెలిపారు.దేవరకొండ అభివృద్ధే లక్ష్యంరేవంత్ రెడ్డి ప్రజా పాలనలో దేవరకొండ నియోజకవర్గానికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున తీసుకురావడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్. తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా ముందుకు వెళ్తున్నాం. వైద్యం, విద్య, సాగునీరు, రహదారులు, తాగు నీరు, ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ పథకాలు.. ఇలా ప్రతి రంగం లో దేవరకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. నా హయాంలోనే సాధ్యమైనంత ఎక్కువ అభివృద్ధి పనులు పూర్తి చేసి దేవరకొండను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాను అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా, పారదర్శకంగా, అందుబాటులో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ .బి.చంద్రశేఖర్ , డీఎంహెచ్వో, దేవరకొండ ఆర్డిఓ, పట్టణ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్లు ఆలంపల్లి నర్సింహా, వడ్త్య దేవేందర్, హన్మంత్ వెంకటేష్ గౌడ్, దేవరకొండ మండల అధ్యక్షుడు మరుపాకుల సురేష్ గౌడ్, కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆర్టిఐ నాయకులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## తెలంగాణ రాష్ట్రంలో 1,000 రోజుల ప్రజా పాలన సంక్షేమం, అభివృద్ధికి కొత్త దిశ



మహబూబాబాద్, సెప్టెంబర్ 01 (వేకువ సమయం) ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో 1000 రోజుల పాలన పూర్తి అయినా సందర్భంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షురాలు డాక్టర్ భూక్య ఉమా మురళీ నాయక్, అధ్యక్షతన జరిగిన, మీడియా సమావేశంలో ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ హాజరైనారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు మహబూబాబాద్ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. గత 1,000 రోజుల్లో తెలంగాణలో పాలన అంటే కేవలం అధికార నిర్వహణ కాదని ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పేదల అభ్యున్నతి, యువత భవిష్యత్తు, మౌలిక వసతుల అభివృద్ధి అనే లక్ష్యాలతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పడానికి గర్విస్తున్నాం అని అన్నారు, రైతు సంక్షేమానికి పెద్దపీట. రైతన్నకు అండగా నిలవాలనే లక్ష్యంతో రైతు భరోసా, పంట రుణమాఫీ, వ్యవసాయానికి పెట్టుబడి సహాయం, ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు, ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ ద్వారా 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూరింది. అలాగే రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పంపిణీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే ఆలోచనతో రైతు కుటుంబాలకు భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.మహిళలకు మహాలక్ష్మి ఆత్మగౌరవానికి అండ.మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తక్కువ ధరకే గ్యాస్ వంటి కార్యక్రమాలు మహిళలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిస్తున్నాయి అని అన్నారు,ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు, మహిళలకు స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమం అన్నారు,పేదల సొంతింటి కల, ఇందిరమ్మ ఇండ్లు.పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ముందుకు సాగుతోంది.ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు, ఒక కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుకు పునాది, అందుకే అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్.పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు గృహజ్యోతి పథకం ద్వారా అర్హత ఉన్న కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది.ఇలాంటి పథకాల ద్వారా ఒకవైపు కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంటే... మరోవైపు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నారు,యువత, ఉద్యోగాలు, భవిష్యత్తు. తెలంగాణ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం నమ్ముతోంది. ఉద్యోగాల భర్తీ, విద్యా రంగంలో మౌలిక వసతుల బలోపేతం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా యువ తెలంగాణకు బలమైన పునాది వేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వైద్యం, విద్య, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, విద్యా సంస్థల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. సంక్షేమం ఒక వైపు, అభివృద్ధి మరో వైపు, ఈ రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మహబూబాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత. మహబూబాబాద్ జిల్లాలో కూడా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులుగా మేము నిరంతరం కృషి చేస్తున్నాం.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.మహబూబాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయానికి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, ఎంపీ పోరిక బలరాం నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకత్వం సమన్వయంతో పనిచేస్తోంది.ఇది కేవలం 1,000 రోజుల ప్రయాణం కాదు.ఈ 1,000 రోజులు ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువచ్చే దిశగా సాగిన ప్రయాణం. రైతుకు భరోసా.మహిళకు గౌరవం.పేదకు ఇల్లు. పేద కుటుంబానికి ఉచిత విద్యుత్.యువతకు అవకాశాలు. విద్యార్థులకు మెరుగైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి. ఇదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం.రాబోయే రోజుల్లో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పం. అని అన్నారు,ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళి నాయక్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ పట్టణ అధ్యక్షులు,మండల పార్టీ అధ్యక్షులు,వివిధ సెల్ అధ్యక్షులు,జిల్లా ,మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## ఆదివాసీ కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి

**ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి**
**- మానుకోట, ములుగు జిల్లాల ఆదివాసీ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమంత్ నాయక్**




సమయం: సెప్టెంబర్ 1, మహబూబాబాద్/ములుగు : ఆదివాసీ కాంగ్రెస్ కమిటీలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మానుకోట, ములుగు జిల్లాల ఆదివాసీ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమంత్ నాయక్ పిలుపునిచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా కమిటీల బలోపేతం కోసం మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో హనుమంత్ నాయక్ పర్యటించారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు పేరుమాళ్ల అశోక్, గ్రంథాలయ చైర్మన్ చందర్ నాయక్ తదితరులతో కలిసి జిల్లా స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో హనుమంత్ నాయక్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం ఉండేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కులు, రిజర్వేషన్లు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరంతరం పోరాడాలని హనుమంత్ నాయక్ అన్నారు. ఆదివాసీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగే చర్యలను ఐక్యంగా ఎదుర్కొంటూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఆదివాసీ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో వారికి అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో మహబూబాబాద్, ములుగు జిల్లాలకు చెందిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

---

## వెయ్యి రోజుల ప్రజాపాలన!

సమయం ప్రతినిధి: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు, ఆత్మగౌరవాన్ని పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ వెయ్యి రోజులు కేవలం క్యాలెండర్లో గడిచిన రోజులు కావు. తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన నిర్ణయాల కాలం. యువతకు ఉద్యోగాలు, రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు గౌరవప్రదమైన జీవనం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు–ఇవన్నీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది గంటల్లోనే అమలు చేసిన మహాలక్ష్మి పథకం ఇందుకు నిదర్శనం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా కోట్లాది మంది మహిళలకు ఆర్థిక ఉపశమనం లభించింది. ఇప్పటివరకు 345 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరిగి, మహిళలు సుమారు రూ.12,075 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారు. ఈ పథకం విజయవంతం కావడంతో పెరిగిన ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీని బలోపేతం చేయడంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్త బస్సుల కొనుగోలు, ఆధునిక బస్ స్టేషన్ల నిర్మాణం, కొత్త డిపోల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అనేక చర్యలతో ఆర్టీసీని ప్రజలకు నమ్మకమైన ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దింది. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2013 నుంచి పెండింగులో ఉన్న రూ.280కోట్ల బాండ్లను క్లియర్ చేయడం; 2017, 2021 పే స్కేల్ సమస్యలను పరిష్కరించడం; 11వ పీఆర్‌సీ అమలు; పెండింగులో ఉన్న డీఏల విడుదల; పీఎఫ్, సీసీఎస్ బకాయిల తగ్గింపు వంటి చర్యలు ఉద్యోగుల్లో నూతన విశ్వాసాన్ని నింపాయి.తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక. ప్రజా ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలను రుణభారం నుంచి విముక్తి చేసింది. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించింది. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట నష్టపరిహారం వంటి కార్యక్రమాలతో రైతుకు ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించింది. సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఒక కుటుంబానికి విద్యుత్ భారం తగ్గించడం, వంటగ్యాస్ ఖర్చును తగ్గించడం, నాణ్యమైన బియ్యం అందించడం, ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం–ఇవన్నీ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలే. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చింది. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోంది. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసి, మరింత మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకువచ్చింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నది. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంకు లింకేజీ కల్పించడం; వడ్డీ రాయితీలు ఇవ్వడం; పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేసింది ప్రజాప్రభుత్వం. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో గణనీయమైన వాటాను కేటాయిస్తున్నది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం, కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా విద్యా రంగంలో సమగ్ర మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది. యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టింది ప్రభుత్వం. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను కల్పిస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ–హబ్, టీ–వర్క్స్, వీ–హబ్ వంటి సంస్థల ద్వారా వేలాది మంది యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందుతోంది. తెలంగాణను పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు చేపట్టింది.



# రీల్ లైఫ్‌లో తమ్ముడికి.. రియల్ లైఫ్‌లో అన్నకి జోడీ

సినిమా ఇండస్ట్రీలో ఎన్నో రకాల ప్రేమ కథలు, పెళ్లి ముచ్చట్లు వార్తల్లో నిలుస్తుంటాయి. అయితే రీల్ లైఫ్‌లో తమ్ముడికి రోమాంక్ చేసి, రియల్ లైఫ్‌లో అన్నయ్యను వివాహం చేసుకున్న హీరోయిన్ల ముచ్చట ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. తాజాగా నటి కావ్య కళ్యాణ్ రామ్, సంగీత దర్శకుడు కాల భైరవ తమ ప్రేమ బంధాన్ని అధికారికంగా ప్రకటించడంతో ఈ ఆసక్తికరమైన అంశం మరోసారి ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కావ్య కళ్యాణ్ రామ్, కాల భైరవ తమ్ముడైన యంగ్ హీరో శ్రీసింహా కోడూరి సరసన ఉస్తాద్ చిత్రంలో హీరోయిన్ గా నటించింది. ఆ సినిమా సమయంలో ఏర్పడిన పరిచయం, ఆ తర్వాత కాల భైరవతో ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు వెళ్తోంది. ఇక గతంలోనూ ఇలాంటి ఆసక్తికరమైన జంటలు టాలీవుడ్, కోలీవుడ్‌లలో వార్తల్లో నిలిచాయి. దివంగత అతిలోక సుందరి శ్రీదేవి, ప్రముఖ నటుడు అనిల్ కపూర్ సరసన మిస్టర్ ఇండియా వంటి అనేక సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఆ తర్వాత ఆయన అన్నయ్య, నిర్మాత బోనీ కపూర్‌ను వివాహం చేసుకున్న విషయం తెల్సిందే. ఇదే వరుసలో నటి శ్రియా రెడ్డి కూడా విశాల్ సరసన పొగరు చిత్రంలో పవర్‌ఫుల్ పాత్రలో నటించింది. ఈ చిత్రంలో విశాల్ – శ్రియా రెడ్డి రొమాంటిక్ సాంగ్ అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇక ఆ సెట్ లో శ్రియాకు విశాల్ అన్నయ్య, నిర్మాత విక్రమ్ కృష్ణ ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి వరకు వెళ్ళింది. అలాగే సోనియా అగర్వాల్, ధనుష్ సరసన కాదల్ కొండేన్ చిత్రంలో నటించి, ఆ తర్వాత ఆ సినిమా దర్శకుడు, ధనుష్ అన్నయ్య అయిన సెల్వరాఘవన్‌ను వివాహం చేసుకుంది. కొన్ని విభేదాల వలన ఈ జంట కొన్నాళ్ళకే విడిపోయారు. ఇలా తెరపై తమ్ముళ్లతో జోడీ కట్టి, జీవితంలో అన్నలకు భాగస్వాములుగా మారిన ఈ హీరోయిన్ల రియల్ లైఫ్ లవ్ స్టోరీలు సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.




# 41 దేశాలు.. 135 సినిమాలు

అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కశ్మీర్ సిద్ధమవుతోంది. జమ్ముకశ్మీర్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7 నుంచి 10 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. 'చలనచిత్రాల నిర్మాణం, సాంస్కృతిక అధ్యయనం, సృజనాత్మక సహకారానికి కశ్మీర్ కీలక వేదిక కావాలన్నదే ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశం. కశ్మీర్‌తో సినిమాకున్న అనుబంధాన్ని పునర్నిర్మించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. స్థానిక ప్రతిభావంతులకు అవకాశాలు కల్పించడం, గ్లోబల్ సినిమా మ్యాప్‌లో కశ్మీర్‌కి తగినంత గుర్తింపు కలగజేయడం, పర్యాటక అభివృద్ధి వంటివి కీలక అంశాలు' అని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకు గానూ ఛాయాగ్రాహకుడు, దర్శకుడు సంతోష్ శివన్ సహా ఐదుగురితో జ్యూరీని ఏర్పాటు చేశారు. 41 దేశాలకు చెందిన 135 చలనచిత్రాలను ఉత్సవంలో ప్రదర్శించనున్నారు. వాటిలో 64 ఎంట్రీలు మన దేశానికి సంబంధించినవి. తొమ్మిది విభాగాల్లో చలనచిత్రాలను ఎంపిక చేసి మొత్తం రూ.96 లక్షల నగదును అందించనున్నారు. ఉత్తమ చలనచిత్రానికి రూ.25 లక్షలను, ఉత్తమ దర్శకుడికి, ఉత్తమ తొలి చిత్ర దర్శకుడికి తలా రూ.15 లక్షలను ఇవ్వనున్నారు. 'ఉత్తమ చిత్రం – జమ్మూకశ్మీర్ సెలక్ట్' కేటగిరీలో రూ.10 లక్షలను, ఉత్తమ నటీనటులకు తలా రూ.8 లక్షలను, ఉత్తమ ఛాయాగ్రాహకుడు, సౌండ్ డిజైనర్, ఉత్తమ ఎడిటర్‌కి తలా రూ.5 లక్షలను ప్రకటించారు. దాల్ లేక్ మీద ఫ్లోటింగ్ స్క్రీన్ ఏర్పాటు చేయాలనే ప్రణాళిక కూడా అమలులోకి రానుంది.



# జైలర్ 2 వాయిదా.. సీఎం విజయే కారణం

సూపర్‌స్టార్ రజనీకాంత్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో వస్తున్న జైలర్ 2 పై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఇప్పటికే వీరి కాంబోలో వచ్చిన జైలర్ భారీ విజయాన్ని అందుకుంది. ఇక జైలర్ 2 అంతకుమించి ఉండనుందని తెలియడంతో ఎప్పుడెప్పుడు ఈ సినిమా రిలీజ్ కానుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ మధ్యనే ఈ సినిమా నుంచి రిలీజైన సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇకపోతే ఈ సినిమా అక్టోబర్ 15 న రిలీజ్ కానుందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే.. జైలర్ 2 అనుకున్న సమయానికి వచ్చేలా కనిపించడం లేదని తమిళ ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. జైలర్ 2 వాయిదా పడడానికి ప్రధాన కారణం తమిళనాడు సీఎం విజయ్ అని కోలీవుడ్ కోడై కూస్తోంది. అదేంటీ.. ఆయనకు, జైలర్ 2 కి సంబంధం ఏంటి అంటే.. ఈ సినిమాలో మొదట విజయ్ రాజకీయాల్లో గెలవరు అనుకోని రజనీ ప్రభుత్వం, రాజకీయ పనితీరుపై కొన్ని ఘాటు డైలాగ్స్ చెప్పాడట. కానీ, విజయ్ గెలిచి సీఎం కూడా అయ్యారు. ఇప్పుడు ఆ డైలాగ్స్ ని విజయ్ ఫ్యాన్స్ అపార్థం చేసుకుంటే సినిమాకి డ్యామేజ్ జరుగుతుందనే ఉద్దేశంతో డైరెక్టర్ నెల్సన్ కీలక మార్పులు చేయడం మొదలుపెట్టాడట. దీనికోసమే కొత్తగా డైలాగ్స్ రాసి.. రీషూట్ చేస్తున్నారట. ఈ షూట్ కాకుండా ఇంకా ఈ సినిమాకు బిజినెస్ డీల్స్ కూడా క్లోజ్ కాలేదని టాక్. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని మేకర్స్.. అక్టోబర్ 15 న కాకుండా కొత్త తేదీని వెతికే పనిలో పడ్డారట. ఇక ఈ రేసులో జైలర్ 2 వెనక్కి తగ్గితే ఆ స్లాట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ వారి రణబాలి లేదా వెంకటేష్ ఆదర్శ కుటుంబం దక్కించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాలంటే మేకర్స్ నోరువిప్పాల్సిందే.

Cinema



# అప్పుడు బాబాయ్.. ఇప్పుడు అబ్బాయ్

గుజరాతీ చిత్రసీమలో సంచలన విజయాన్ని అందుకున్న ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్ 'లాలో: కృష్ణ సదా సహాయతే' ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు రీమేక్ రూపంలో రానుందనే వార్తలు సినీ వర్గాల్లో హల్ చల్ చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాజెక్ట్‌లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ శ్రీకృష్ణుడి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేవలం రూ.50 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కిన 'లాలో' బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.120 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తొలి గుజరాతీ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఆధ్యాత్మికత, ఎమోషన్, కామెడీ కలగలిపి రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులను థియేటర్లకు పరుగులు పెట్టించింది. ఈ నేపథ్యంలోనే.. ఈ సినిమా సాధించిన ఘన విజయంతో తెలుగు సహా ఇతర భాషల నిర్మాతల దృష్టి ఇప్పుడు ఈ చిత్రంపై పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలుగు రీమేక్ హక్కుల కోసం చర్చలు జరుగుతున్నాయని సమాచారం. కథలోని అంశాలు తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్ట్ అవుతాయని, ఇక్కడి వారికి చాలా దగ్గరగా ఉంటుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ రీమేక్‌కు ప్రముఖ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. డిఫరెంట్ స్క్రీన్ ప్లేతో, కథలను తనదైన శైలిలో విభిన్నంగా చెప్పడంలో తనకంటూ ప్రత్యేక బ్రాండ్ సంపాదించుకున్న ఆయన, 'లాలో' కథను తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా మరింత భారీ స్థాయిలో ఆవిష్కరించే అవకాశం ఉందని అంటున్నారు.

**కృష్ణుడి పాత్రలో రామ్ చరణ్?**

అయితే.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే అది రామ్ చరణ్ పేరు వినిపించడం. ఈ సినిమా ప్రధానంగా శ్రీకృష్ణుడి పాత్ర చుట్టూ సాగే కథ కావడంతో ఈ పాత్ర చరణ్‌కు ఫర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతుందని ఆయనను సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నప్పటికీ, నిర్మాతలు లేదా నటీనటుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే ఈ న్యూస్ నిజమైతే మాత్రం తెలుగు సినీ పరిశ్రమలో ఇది అత్యంత క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచే అవకాశముంది. ఇటీవల డివైన్ కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమాలు అధిక శాతం విజయం సాధిస్తుండడంతో ఈ చిత్రంలోని కథ యూనివర్సల్ సబ్జెక్ట్ కావడంతో రామ్ చరణ్ నటిస్తే సినిమా ఇంకా చాలామందికి రీచ్ అవుతుందని మేకర్స్ అంచనాలు వేస్తున్నారు. కాగా కథలో మెయిన్ క్యారెక్టర్ కోసం సత్యదేవ్ లాంటి నటుడిని సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది.

**కథ ఇదే..**

అప్పటికే పెళ్లై ఐదేండ్ల వయసు కూతురు ఉన్న ఓ యువకుడు ఆటో నడుపుతూ ఫ్యామిలీని పోషిస్తుంటాడు. అయితే తాగుబోతైన ఆ యువకుడు ఓ రోజు భార్యతో గొడవ పడి ఆటోతో లాంగ్ డ్రైవ్‌కి వెళ్లి ఓ ఇంట్లో చిక్కుకు పోతాడు. అక్కడి నుంచి బయట పడే మార్గం లేక, మాట్లాడే తోడు లేక ఒక్కడే విలవిల లాడిపోతుంటాడు. ఇదే సమయంలో ఓ కొత్త వ్యక్తి వచ్చి అతనికి సాయం చేసే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో వారిరువురితో పాటు అతని చుట్టూ సమాజంలోని మనషుల మధ్య జరిగే సంఘర్షణ, ఎమోషనల్, డివైన్ రైడ్ ఈ సినిమా. ఇదిలాఉంటే.. గతంలో గోపాల గోపాల సినిమాలో పవన్ కల్యాణ్ కృష్ణుడిగా నటించి మెప్పించగా ఇప్పుడు రామ్ చరణ్ వద్దకు అదే తరహా పాత్ర రావడం మెగా ఫ్యాన్స్‌ను ఉబ్బి తబ్బిబయ్యేలా చేస్తోంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085